


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 4 సంచిక: 201, పేజీలు - 08

సోమవారం, డిసెంబర్ 2, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

## నవంబరు మాసంలో జీఎస్టీ వసూళ్లు రూ.1.82 లక్షల కోట్లు

2లో..




## ఇండియా సహా బ్రిక్స్ దేశాలకు ట్రంప్ వార్నింగ్

2లో..



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)**అంతర్జాతీయ వర్తకంలో డాలర్‌కు ప్రత్యామ్నాయం లేదని అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. డాలర్‌ను దూరంపెట్టే ప్రయత్నాలు చేసే దేశాలు అమెరికాతో వర్తకానికి కూడా దూరం కావాల్సిందేనని హెచ్చరించారు.

## ఐసీసీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన జై షా



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) కార్యదర్శి అయినప్పటికీ, భారత క్రికెట్ దశ దిశ అన్నీ తానై నడిపిస్తున్న జై షా, ఇప్పుడు ఐసీసీ పీఠాన్ని అధిష్ఠించారు. ఐసీసీ నూతన చైర్మన్ గా ఆయన ఇవాళ బాధ్యతలు స్వీకరించారు. జై షా

2లో..

# రేవంత్‌కు 'పునరాలోచన' తప్పదా.?

## - ఏడాది పాలనపై ఆత్మ విచారం చేసుకుంటారా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అధికారంలో ఉన్న పార్టీ చాలా జాగ్రత్తగా అడుగులు వేయాలి. ఏ చిన్న తేడా వచ్చినా రివర్స్ అవుతుంది. ముఖ్యంగా విపక్షాలను టార్గెట్ చేసే సమయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. లేకపోతే అవి వికటించే ప్రమాదం కూడా ఉంటుంది. ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌ను కట్టడి చేయాలన్నది ఆ పార్టీ ప్లాన్. దీనిని రాజకీయ కోణంలో చూసినప్పుడు తప్పుపట్టాల్సిన అవసరం లేదు. అయితే ఆ ప్లాన్ బెడిసికొడితేనే ఇబ్బంది. తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలు ఈ తరహాలోనే ఉన్నాయన్నది రాజకీయ విశ్లేషకుల మాట. బీఆర్ఎస్‌పై ఆయన కసితో ఉండొచ్చు. రాజకీయ వైరం మేరకు ఆ పార్టీని కోలుకోకుండా చేయాలని కూడా భావించవచ్చు. కానీ, ఆ దిశగా తీసుకున్న చర్యలు మాత్రం పెద్దగా ఫలించకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ప్రస్తుతం రేవంత్ సర్కారు పాలన ప్రారంభమై ఏడాది పూర్తవుతున్న సమయంలో ఇప్పుడు ఆసక్తిగా మారింది.

### ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం

ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరమీదికి తెచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నతాధికారులను వినియోగించి ఎన్నికలకు ముందు ఈ తతంగాన్ని నడిపించిందనే ఆరోపణలు ఉన్నాయి. పెద్ద ఎత్తున దీనిపై విచారణ కూడా సాగింది. ఇంకేముందు బీఆర్ఎస్ కీలక నాయకుడు కేటీఆర్ అరెస్టు ఖాయమని అనుకున్నారు. కానీ, ఇప్పటి వరకు కేసు విచారన జరుగుతూనే ఉంది. కేటీఆర్ సేఫ్‌గానే ఉన్నారు.

### బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలు

తద్వారా ప్రతిపక్షాన్ని నిలువరించాలన్నది సీఎం రేవంత్ ప్లాన్. ఈ క్రమంలోనే ఇంటికి వెళ్లి మరీ అరిక పూడి గాంధీ వంటివారిని పార్టలో చేర్చుకున్నారు. కానీ, ఇది సొంత పార్టీలోనే బెడిసి కొట్టింది. బీఆర్ఎస్‌పై సానుభూతి పెంచేలా చేస్తున్నారంటూ జీవన్ రెడ్డి వంటి వారు రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది. మరోవైపు కేసులు కూడా కొనసాగుతున్నాయి.

### హైడ్రా..

మూసీ నది ప్రక్షాళన చేయడాన్ని ఎవరూ తప్పుపట్టకపోయినా హైడ్రా పేరుతో ఈ ఏడాది జూలైలో తెచ్చిన వ్యవస్థ సాధారణ ప్రజలకు కంటిపై కునుకు లేకుండా చేసింది. మరోవైపు రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం పడింది. పడలేదని ప్రభుత్వం చెబుతున్నా రియల్ వర్గాలు మాత్రం వెంచర్లు నిలుపుదల చేసుకున్నాయి. పైగా ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ నాయకులను హైడ్రా నిలువరించలేక పోయింది. ఇలా పలు కీలక అంశాల్లో రేవంత్‌రెడ్డి వేసిన అడుగులు సమీక్షకు గురయ్యాయనే చెప్పాలి. మరి ఆయన ఆత్మ విచారం చేసుకుంటారో లేదో చూడాలి. ఒక్కమాటలో చెప్పాలంటే బీఆర్ఎస్‌ను దాని మానాన దానిని వదిలేసి ఉంటే వేరేగా ఉండేది. కానీ, వీటిని కెలకడం ద్వారా ఆ పార్టీకి అనవసర హైప్ ఇచ్చారన్న చర్చ కూడా సాగుతోంది.

## కాంగ్రెస్ తో దోస్తీకి స్వస్తి

### - ఒంటరిగానే పోరాటం - స్పష్టం చేసిన కేజ్రీవాల్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** త్వరలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని, ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) స్పష్టం చేసింది. మొన్నటి వరకు పార్టీ మహాకూటమికి అవకాశం ఉందని భావించిన కేజ్రీవాల్ ఇప్పుడు దానికి పూర్తి బ్రేక్ ఇచ్చారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నిర్ణయం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ముక్కోణపు పోటీని రేకెత్తిస్తుంది. ఇందులో ఆ పార్టీ బిజెపి, కాంగ్రెస్‌లపై ఒంటరిగా పోటీ చేస్తుంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సన్నాహాలు జరుగుతున్నాయి. అధికార ఆమ్ ఆద్మీ పార్టీతో పాటు, బిజెపి, కాంగ్రెస్ కూడా తమ అభ్యర్థుల జాబితాలను సిద్ధం చేస్తున్నాయి.

### - పరాజయం నుంచి పాఠాలు

హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో నేషనల్ కాంగ్రెస్ ఘోర పరాజయంపై ఆమ్ ఆద్మీ పార్టీ కూడా అప్రమత్తమైంది. అందుకే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నిర్ణయించింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై

2లో..

## కాకినాడ పోర్టు స్మగ్లింగ్ డెన్‌కు బాస్ ఎవరు.?

### - కాకినాడ పోర్టు అంశంపై నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యలు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమ బియ్యం నిల్వలపై దాడి చేశామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్ల పాటు అక్రమంగా బియ్యం ఎగుమతి చేశారని ఆరోపించారు. విజయవాడలో ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన రేషన్ బియ్యం కోసం

2లో..

# ఇది సరైన సమయమేనా.?

## - క్యాడర్ బయటకు వస్తుందా.?



**అమరావతి (ప్రశ్న న్యూస్)** వైఎస్ జగన్ సంక్రాంతి తర్వాత జిల్లాల పర్యటనకు వెళతామంటున్నారు.పార్టీ కార్యకర్తలతో జగన్ సమావేశమవ్వాలని నిర్ణయించారు. ప్రతి బుధ, గురువారాల్లో కార్యకర్తల్లో ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రతి రోజూ మూడు నుంచి నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించాలని నిర్ణయించారు. అలాగే ప్రతి పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జగన్ సమీక్ష చేయనున్నారు. ఆయన అధికారికంగా చేసిన ప్రకటన ఇది. అంటే ఆయన జనంలో ఉండేందుకు, పార్టీని బలోపేతం చేసేందుకు తీసుకున్న నిర్ణయంగానే చూడాలి. అలాగే క్యాడర్ లో ఉత్సాహం నింపేందుకు ఆయన చేస్తున్న తొలి ప్రయత్నం ఇది అనుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే ఇప్పటి వరకూ ఆయన కార్యకర్తలను పట్టించుకోలేదన్న విమర్శలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కార్యకర్తలతో భేటీకి జగన్ సిద్ధమవుతున్నారు.

### - అధికారంలో ఉన్న ఐదేళ్లూ

2లో..

# రూటు మారుస్తున్న రైతులు

## -ఎన్ని ఎకరాలు కాదు, లాభం ఎంత అనేదే మ్యాటర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఒకప్పుడు రైతులు వరి, పసుపు, మొక్కజొన్న, ఎర్రజొన్న లాంటివే ఎక్కువగా పండించే వారు. లాభాలు వచ్చినా, నష్టం వాటిల్లినా ఇవే పంటలు వేసేవారు. కానీ ఇప్పుడు వారి ఆలోచనలు మారుతున్నాయి. ఎన్ని ఎకరాల్లో సాగు చేశామన్నది కాదు, ఎంత లాభాలు గడించామన్నదే

2లో..

## అన్నదాతలకు తెలంగాణ ప్రభుత్వం

# గుడ్ న్యూస్

### - రైతు భరోసాపై సీఎం రేవంత్ కీలక ప్రకటన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో రైతులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రైతు భరోసా కొనసాగిస్తామని స్పష్టం చేసింది. సంక్రాంతి పండుగ తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా

2లో..

## ఉత్కంఠకు తెర పడుతుందా?

### - నేడే మహారాష్ట్ర సీఎం పేరు ఖరారు



**ముంబై (ప్రశ్న న్యూస్)** మహారాష్ట్ర సీఎం పదవిపై నెలకొన్న ఉత్కంఠ దాదాపు తొలగిపోయినట్టే. తదుపరి ముఖ్యమంత్రి రేసు నుంచి ఏక్ నాథ్ షిండే తప్పుకున్నట్టు ఆయన మాటల ద్వారా అర్థమవుతోంది! బీజేపీ హైకమాండ్ ఏ నిర్ణయం తీసుకున్నా పాటిస్తానని షిండే స్పష్టం చేశారు. ప్రస్తుతం ఏక్ నాథ్ షిండే ఆపద్ధర్మ సీఎంగా కొనసాగుతున్నారు. ఇటీవల మహాయుతి కూటమి నేతలు కీలక సమావేశం ఏర్పాటు చేయగా, ఉన్నట్టుండి షిండే అనారోగ్యం పేరిట

2లో..

# 6 అబద్ధాలు 66 మోసాలు

## - కాంగ్రెస్ గ్యారంటీలపై బీజేపీ ఛార్జ్ షీట్

- ఎన్నికల వేళ ఆరు గ్యారెంటీలు ప్రచారం చేసిన కాంగ్రెస్
- ఈ ఏడాదిలో ఒక్క గ్యారెంటీ కూడా నెరవేర్చలేదన్న కిషన్ రెడ్డి
- కాంగ్రెస్ సంబరాలు చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారని వెల్లడి




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనకు ఏమాత్రం తేడా లేదని కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి విమర్శించారు. ఆదివారం 'కాంగ్రెస్ గ్యారంటీల గారడీ' 6 గ్యారంటీలు 66 మోసాలు పేరుతో బీజేపీ ఛార్జ్ షీట్ విడుదల చేసింది. 24%శ%7 దగా ఇదీ తెలంగాణలో కాంగ్రెస్ ఏడాది పాలన అంటూ విమర్శించింది. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. గత సంవత్సరం కాలంగా మార్పు పేరుతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్. తెలంగాణ రాష్ట్రంలో మార్పు రావాలి కాంగ్రెస్ కావాలి అనే నినాదంతో ప్రజలను నమ్మించి ఓట్లు దండుకొని కాంగ్రెస్ ప్రభుత్వంలోకి వచ్చి

2లో..

## దండకారణ్యంలో

# అలజడి

### - ములుగు జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్

### - ఏడుగురు మావోయిస్టుల హతం



**ములుగు (ప్రశ్న న్యూస్)**ం2027 నాటికి మావోయిస్టు పార్టీని దేశం నుంచి తుదముట్టించడమే తమ లక్ష్యమని ప్రధాని మోదీ, హెూంమంత్రి అమిత్ షాలు ప్రకటించగా మీ ఆపరేషన్ కాగర్‌ను అడ్డుకోవడమే మా లక్ష్యం అనేలా మావోయిస్టులు వ్యవహరిస్తున్నారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దు, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో అంటే మావోయిస్టుల ప్రభావం ఉన్న ప్రాంతాల్లో యుద్ధం నడుస్తోందనే చెప్పాలి. నిత్యం తుపాకుల మోతలు, పేలుడు పదార్థాల చప్పుళ్లతో

2లో..



# ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకం

## - మాలల సింహగర్జనలో వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మాలలు ఐక్యంగా ఉండి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు కాంగ్రెస్ సీనియర్ నేత, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి. ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన మాలల సింహగర్జన సభకు ఆ సామాజిక వర్గానికి చెందిన పలువురు ముఖ్య నేతలు హాజరై ప్రసంగించారు. రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన మాలలను ఉద్దేశించి వివేక్ ప్రసంగించారు. మాలలు కదిలితే ఏం జరుగుతుందో మనం చూపిద్దామని వివేక్ అన్నారు. అంబేద్కర్ మాల, మాదిగ అని

2లో..

# నవంబరు మాసంలో జీఎస్టీ వసూళ్లు రూ.1.82 లక్షల కోట్లు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) నవంబరు నెలకు సంబంధించిన జీఎస్టీ వసూళ్ల వివరాలను కేంద్రం వెల్లడించింది. నవంబరు మాసంలో జీఎస్టీ వసూళ్లు రూ.1.82 లక్షల కోట్లు అని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. గతేడాది నవంబరుతో పోల్చితే జీఎస్టీ వసూళ్లలో 8.5 శాతం పెరుగుదల నమోదైనట్టు వివరించింది. 2023 నవంబరులో రూ.1.68 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైంది. ఈ ఏడాది నవంబరులో దేశీయ ఆర్థిక లావాదేవీల ద్వారానే అత్యధిక ఆదాయం లభించినట్టు కేంద్రం పేర్కొంది. నవంబరు జీఎస్టీ వసూళ్లలో సీజీఎస్టీ రూ.34,141 కోట్లు కాగా రాష్ట్రాల జీఎస్టీ రూ.43,047 కోట్లు. అదే సమయంలో ఐజీఎస్టీ రూ.91,828 కోట్లు, సెస్ రూ.13,253 కోట్లు. భారత్ లో జీఎస్టీ ప్రవేశపెట్టాక ఇప్పటివరకు అత్యధిక వసూళ్లు అంటే ఈ ఏడాది ఏప్రిల్ లో వసూలైన జీఎస్టీ గురించే చెప్పాలి. 2024 ఏప్రిల్ లో రికార్డు స్థాయిలో రూ.2.10 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైంది. ఈ ఏడాది అక్టోబరులో రూ.1.87 లక్షల కోట్ల జీఎస్టీ వసూలు కాగా. ఇది రెండో అత్యుత్తమ జీఎస్టీ కలెక్షన్ గా ఉంది.

# ఇండియా సహా బ్రిక్స్ దేశాలకు ట్రంప్ వార్నింగ్

ఈ మేరకు బ్రిక్స్ దేశాలు ఇండియా, బ్రెజిల్, చైనా, రష్యా, సౌతాఫ్రికాలకు నేరుగా వార్నింగ్ ఇచ్చారు. అంతర్జాతీయ లావాదేవీలకు డాలర్ స్థానంలో మరో కరెన్సీ వాడాలని ఇటీవల బ్రిక్స్ దేశాలు నిర్ణయించాయి. దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. డాలర్‌కు ప్రత్యామ్నాయం లేదని స్పష్టం చేశారు. డాలర్ స్థానంలో వేరే కరెన్సీని ఉపయోగించే దేశాలపై పన్నులు పెంచుతామని చెప్పారు. అమెరికాకు ఆయా దేశాలు ఉత్పత్తి చేసే వస్తువులపై పన్నులు 100 శాతం పెంచుతామని స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాల ప్రయత్నాలను తాము ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటామని, డాలర్‌కు దూరంగా జరిగే దేశాలకు అమెరికా ఆర్థిక వ్యవస్థలో చోటుండదని హెచ్చరించారు. అమెరికాకు ఎగుమతుల విషయం మర్చిపోవాల్సి వస్తుందని వివరించారు. కాగా, అక్టోబర్‌లో రష్యాలోని కజన్‌లో జరిగిన బ్రిక్స్ దేశాల సదస్సులో అంతర్జాతీయ లావాదేవీలలో డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీ వాడాలని నిర్ణయించాయి. దీనివల్ల స్థానిక కరెన్సీ బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డాయి. ఈ సమావేశంలో ఈజిప్ట్, ఇరాన్, యూఏఈ ఈ ప్రతిపాదనకు అంగీకారం తెలిపాయి. ఈ మేరకు ఓ డిక్లరేషన్‌పై బ్రిక్స్ దేశాలు సంతకం చేశాయి. దీనిపై తాజాగా ట్రంప్ స్పందిస్తూ ఇండియా సహా బ్రిక్స్ దేశాలకు హెచ్చరికలు జారీ చేశారు.

# ఐసీసీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన జై షా

ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. ప్రస్తుతం జై షా వయసు 35 ఏళ్లు కాగా ఐసీసీ ఛైర్మన్ పదవిని చేపట్టిన అత్యంత పిన్న వయస్కుడిగా ఘనత అందుకున్నారు. అంతేకాదు, ఐసీసీ పీఠం ఎక్కిన ఐదో భారతీయుడు జై షా. ఇప్పటివరకు ఐసీసీలో భారత్ కు ప్రముఖ స్థానం దక్కుతూ వస్తోంది. గతంలో జగ్మోహన్ దాల్మియా (1997-2000), శరద్ పవార్ (2010-12) ఐసీసీ అధ్యక్షులుగా పనిచేయగా ఎన్ శ్రీనివాసన్ (2014-15), శశాంక్ మనోహర్ (2015-2020) ఐసీసీ ఛైర్మన్లుగా వ్యవహరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తనయుడైన జై షా 2009లో క్రికెట్ పాలనా వ్యవహారాల్లో తన ప్రస్థానం ప్రారంభించారు. గుజరాత్ క్రికెట్ సంఘం సంయుక్త కార్యదర్శిగా పనిచేసిన షా అహ్మదాబాద్ లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియంను నిర్మించడంలో కీలకపాత్ర పోషించారు. 2019లో బీసీసీఐ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడిగానూ, ఐసీసీ ఆర్థిక, వాణిజ్య వ్యవహారాల కమిటీ ఛైర్మన్ గానూ వ్యవహరించారు. కాగా, 2020 నవంబరు నుంచి ఐసీసీ ఛైర్మన్ గా గ్రెగ్ బార్ క్లే వ్యవహరించారు. ఇప్పుడు బార్ క్లే స్థానంలో జై షా ఐసీసీ పగ్గాలు అందుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్లో అత్యున్నత పదవిని చేపట్టడం గౌరవంగా భావిస్తున్నానని జై షా తెలిపారు. తనకు మద్దతిచ్చిన ఐసీసీ బోర్డు డైరెక్టర్లకు, సభ్య దేశాల క్రికెట్ బోర్డులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని వెల్లడించారు.

# కాంగ్రెస్ తో దోస్తీకి స్వస్తి

ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సంచలన ప్రకటన చేశారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోదని అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి స్పష్టం చేశారు. ఇప్పటి వరకు పొత్తుపై అరవింద్ కేజ్రీవాల్ ఏమీ మాట్లాడలేదు. అయితే, ఢిల్లీలో కాంగ్రెస్‌తో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పొత్తు ఉండదని హర్యానా ఎన్నికల తర్వాత పలువురు ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పొత్తు పెట్టుకుంది. పొత్తు వల్ల ఆయనకు ఎలాంటి ప్రయోజనం కలుగలేదు. హర్యానాలో కూడా కాంగ్రెస్ సీట్ల పోరుపై పొత్తు కుదరలేదు.

**- ఒంటరిగానే ఆప్ పోటీ**

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఢిల్లీలో ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేస్తుందని ఆయన తేల్చి చెప్పారు. సీట్ల విషయంలో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మధ్య వివాదం ఏర్పడినప్పుడు ఢిల్లీలో కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని చాలా మంది ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకులు చెప్పారు. ఈరోజు అరవింద్ కేజ్రీవాల్ విలేకరుల సమావేశం నిర్వహించి ఆ పార్టీతో ఆప్ కు గల సమస్యపై, అలాగే ఆమ్ ఆద్మీ ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని స్పష్టం చేశారు. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి పాలైనట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత కాంగ్రెస్‌తో పొత్తుకు అనుకూలంగా లేరు. వచ్చే ఏడాది ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. కొన్ని స్థానాల్లో తన అభ్యర్థుల పేర్లను కూడా ప్రకటించారు. కాగా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ బీజేపీ, కాంగ్రెస్‌తో తలపడనుంది. ఢిల్లీలో తన రాజకీయ మూలాలను బలోపేతం చేసుకునేందుకు బీజేపీ ఇప్పటికే ప్రజలకు చేరువ అయ్యేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. అక్కడ కాంగ్రెస్ కూడా పాత పాపులారిటీ తెచ్చుకునేందుకు వ్యూహాలను రచిస్తోంది. తద్వారా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో త్రిముఖ పోటీ జరిగే అవకాశం బలపడింది.

**- దాడిపై కేజ్రీవాల్ స్పందన**

ఐబిడ్ మార్చ్ సమయంలో తన పైన జరిగిన దాడి గురించి కూడా అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. ఆయన మాట్లాడుతూ "నేను ఈ సమస్యను (లా అండ్ ఆర్డర్) లేవనెత్తిన తర్వాత అమిత్ షా ఏదైనా చర్య తీసుకుంటారని నేను ఆశించాను. దాడి సమయంలో నాపై లిక్విడ్ విసిరారు, అది ప్రమాదకరం కాదు, కానీ ఒక వేళ అది హానికరం అయితే. నిన్న మా ఎమ్మెల్యేలలో ఒకరిని అరెస్టు చేశారు. అతని (నరేష్ బల్యాన్) తప్పు ఏమిటంటే అతను చెడ్డ వ్యక్తులకు బలి అయ్యాడు." అని కేజ్రీవాల్ చెప్పుకొచ్చారు.

# కాకినాడ పోర్టు స్మగ్లింగ్ డెన్‌కు బాస్ ఎవరు.?

రూ.12,800 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. కాకినాడలో జూన్ చివరి వారంలో 13 గిడ్డంగుల్లో తనిఖీలు చేశామని పట్టుకున్న బియ్యంలో 25 వేల టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించినట్లు వెల్లడించారు. ఆయా గిడ్డంగుల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని అన్నారు. రేషన్ బియ్యం విషయంలో కాకినాడ పోర్టుపై ప్రత్యేక దృష్టి పెట్టామని పేర్కొన్నారు.

**- జగన్.. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి**

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంపై మంత్రి నాదెండ్ల తీవ్ర విమర్శలు గుప్పించారు. మాజీ సీఎం జగన్‌కు వరుస ప్రశ్నలు సంధించారు. 'గత ఐదేళ్ల పాటు కాకినాడ పోర్టులోకి ఎవరినీ రానివ్వలేదు. ఇక్కడ కేవలం 20 మంది సెక్యూరిటీనే ఉంచుతారా.?. ఎప్పుడు చూసినా ఇక్కడ 12 వెసల్స్ ఉంటాయి. మిగతా పోర్టుల కంటే కాకినాడ నుంచే ఎక్కువ ఎగుమతులు ఎందుకు జరిగాయి.?. వ్యవస్థను గుప్పిట్లో ఉంచుకుని బియ్యం ఎగుమతి చేశారు. ద్వారంపూడి, కన్నబాబు గతంలో ఎందుకు మాట్లాడలేదు. పూర్తిస్థాయిలో పాతుకుపోయిన వ్యవస్థను ప్రక్షాళన చేయాలనే ఈ తనిఖీలు చేస్తున్నాం. కాకినాడ పోర్టు వెనుక ఎవరున్నారో ప్రజలకు అర్థం కావాలి. ఈ పోర్టు నుంచి స్మగ్లింగ్ మాఫియాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వాస్తవాలు తెలుసుకునేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన ప్రయత్నం గొప్పది. కాకినాడ పోర్టుపై వస్తోన్న ప్రశ్నలకు జగన్ జవాబు చెప్పాలి.' అని మంత్రి డిమాండ్ చేశారు. కాగా, ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ పోర్టును సందర్శించారు. కాకినాడలో అక్రమంగా రైస్ స్మగ్లింగ్ చేస్తున్న వ్యవహారంపై సీరియస్ అయ్యారు. రేషన్ బియ్యాన్ని ఆఫ్రికాకు అక్రమంగా ఎగుమతి చేస్తున్నట్లు గుర్తించి షిప్‌ను ఛేజ్ చేసి మరీ పట్టుకున్నారు. పోర్టులోకి రైస్ ఎలా వస్తుందని పవన్ స్థానిక టీడీపీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావును ప్రశ్నించారు. మీరు కూడా కాంప్రమైజ్ అయితే ఎలా అందుకేనా మనం పోరాటం చేసిందని అసహనం వ్యక్తం చేశారు. పోర్టు అధికారులపైనా మండిపడ్డారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కాకినాడ పోర్టును స్మగ్లింగ్ హబ్‌గా మార్చారు. పోర్టు నుంచి జరిగే అక్రమాలు ఆపుతామని గతంలోనే హామీ ఇచ్చాను. మంత్రి నాదెండ్ల పలుచోట్ల తనిఖీలు నిర్వహించి 51 వేల టన్నుల రేషన్ బియ్యం పట్టుకున్నారు. పోర్టుకు రోజుకు వెయ్యి నుంచి 1100 లారీలు వస్తాయి. రేషన్ మాఫియా వెనుక ఎవరున్నా వదిలిపెట్టం. రేషన్ బియ్యం పేదలకు మాత్రమే అందాలి. కాకినాడ పోర్టుకు భద్రత పెంచాలని కేంద్ర హోంమంత్రికి లేఖ రాస్తాను.' అని పవన్ తెలిపారు.

# రూటు మారుస్తున్న రైతులు

అన్నట్లుగా పంటలు వేస్తున్నారు. రెండు ఎకరాలైనా నిత్యం చేతికి డబ్బు అందే పంటలవైపు ఆసక్తి చూపుతున్నారు. వినూత్న పంటలు వేసి లాభాలు అర్జిస్తున్నారు. సరికొత్త విధానాలు అనుసరిస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.వరి, పసుపు, మొక్కజొన్న, ఎర్రజొన్న పండించే రైతులు ధరలు లేక, దిగుబడి రాక నష్టాల పాలవుతూ తిరిగి అప్పులు చేస్తుండడం, వాటిని తీర్చలేక కొంతమంది రైతులు తనువు చాలించడం ఇవన్నీ చాలా ఏళ్లుగా జరుగుతున్న సంఘటనలు. అదృష్టవశాత్తు అధిక దిగుబటి వస్తేనో, లేక మార్కెట్ ధర పెరిగితేనో తప్ప నష్టాలు పూడ్చుకొని లాభాల్లోకి అడుగుపెట్టరు. అదే ఇంకా చిన్నకారు రైతులకు ఏళ్ల సమయం పడుతుంది. నిత్యం మార్కెట్‌కు తరలించే పంటలు పండిస్తే ఒకసారి కాకపోయినా మరో పంట చేతికి అందుతుంది. ప్రజలకు అవసరమయ్యే పండ్లు, కూరగాయలు పండిస్తే లాభాలు తప్పకుండా వస్తాయి. ఇప్పులు ఇదే రైతుల ఆలోచనలను మారుస్తోంది.

**- ఏడాది కాలం పాటు పంట వచ్చేలా**

మార్కెట్‌లో ధర ఎక్కువ పలుకుతున్న, ఎక్కువ కాలం పంట చేతికి వచ్చే పంటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. అందులో అంతర్ సాగుతో ఏడాది పొడవునా లాభాలు వచ్చేలా అడుగులు వేస్తున్నారు. తైవాన్ జామ, డ్రాగన్ ఫ్రూట్, కశ్మీర్ యాపిల్, ఉల్లిగడ్డ, తీగజాతి టమాట, బెర్రి, కాకర, వంకాయ, సోరకాయ, కొత్తిమీర, బీరకాయ, ఉల్లి, ఆకుకూరలను సాగు చేస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని మోతెలో వరి సాగును తగ్గించి ప్రత్యేక కుంటలు నిర్మించి చేపల పెంపకం ప్రారంభించారు ఒక రైతు. ఒకే నెలలో మూడు, నాలుగు రకాల సాగు చేసి ఒకదాని వెంట మరో పంట మార్కెట్‌కు తరలించడం ద్వారా లాభాలు పొందడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నారు.

# ఇది సరైన సమయమేనా.?

గత ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు జగన్ కార్యకర్తలను పూర్తిగా పట్టించుకోకుండా వదిలేశారు. వారిని అస్సలు నేతల నుంచి జగన్ వరకూ ఎవరూ పట్టించుకోవడం లేదు. క్యాడర్ నుచూసి పురుగులును చూసి చూశారు. కనీసం వారు పడ్డ కష్టానికి సాయం చేయాలని కూడా జగన్ కానీ నేతలు కానీ ఆలోచించలేదు. పూర్తిగా తనను రెండోసారి వాలంటీర్లు అధికారంలోకి తెస్తారని భావించారు. వాలంటీర్లతో పాటు తాను అమలు చేసిన సంక్షేమ పథకాలు, బటన్ నొక్కుడు కార్యక్రమాలు తనను మరోసారి అందలం ఎక్కిస్తాయన్న భ్రమలో పడి జెండా మోసిన కార్యకర్తలను పట్టించుకోలేదు. దీంతో మొన్నటి ఎన్నికల సమయంలో కార్యకర్తలు పెద్దగా పట్టించుకోలేదు. పార్టీకి పోటీ చేసిన అభ్యర్థులకు చెందిన ముఖ్య అనుచరుల హడావిడి మాత్రమే పోలింగ్ కేంద్రాల వద్ద కనిపించింది. చొక్కాలు చించుకుని ఎవరూ ముందుకు రాలేదు. అందుకే అనేక పోలింగ్ కేంద్రాల వద్ద కూటమి పార్టీలదే పై చేయిగా మారింది. పార్టీ బలంగా ఉన్న ప్రాంతాల్లోనూ క్యాడర్ మొహం చాటేసింది.

**- ఫలితాల అనంతరం**

ఎన్నికల ఫలితాల తర్వాత అసలు విషయం అర్థమయింది. జగన్ కు క్యాడర్ పార్టీ గెలుపునకు ఎంత ముఖ్యమో అవగతమయింది. క్యాడర్ లేనిదే లీడర్లు లేరు. లీడర్లు లేనిదే పార్టీ లేదన్న విషయాన్ని జగన్ గుర్తించడానికి ఇన్నాళ్లు సమయం పట్టింది. అయితే ఐదేళ్లు పుణ్యకాలం గడిచిపోయిన తర్వాత, వారు ఆర్థికంగా చితికపోయిన తర్వాత కార్యకర్తల్లో తిరిగి నూతనోత్తేజం నింపాలని జగన్ చేస్తున్న ప్రయత్నాలు ఎంత మేరకు ఫలిస్తాయో ఇప్పుడే చెప్పలేం. ఎందుకంటే జగన్ ను నమ్మి బయటకు వస్తే కేసులు తమపై నమోదవుతాయన్న భయం క్యాడర్ లో ఉంటుంది. అందుకే కరడుగట్టిన వారు తప్ప సానుభూతి పరులు, జగన్ ను అభిమానించే వారు ఎవరూ అటువైపు చూడరన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఏపీ ఎన్నికలు జరిగి ఐదు నెలలు కాలేదు. ఇంకా నాలుగున్నరేళ్లు ఎన్నికలకు సమయం ఉంది. ఈ టైంలో బయటకు వచ్చి జిందాబాద్ లు కొడితే జైలు తప్పదన్నబెంగ క్యాడర్ లో ఉంటుంది.

**- క్యాడర్ సహకరిస్తుందా?**

అందుకే జగన్ జిల్లా పర్యటనలకు క్యాడర్ అనుకున్న స్థాయిలో రాకపోవచ్చన్న భావన పార్టీ నేతల నుంచే వ్యక్తమవుతుంది. జగన్ ను నమ్మి, స్థానిక నేతలను విశ్వసించి జనంలోకి జెండా పట్టుకుని వస్తే కష్టాలు పడేది తామేనని వారికి తెలుసు. అందుకే మనసులో అభిమానం ఉన్నప్పటికీ ఇంత త్వరగా బయటపడి తాము ఇబ్బందులు తెచ్చుకోవడం ఎందుకన్న భావన ఖచ్చితంగా కార్యకర్తల్లో ఉంటుంది. అందుకే జగన్ జిల్లా పర్యటనలకు ఇది సరన సమయం కాదంటున్నారు. ఇంకా కూటమి ప్రభుత్వానికి కొంత సమయం ఇచ్చి హామీలు అమలుపర్చకుండా కొంత కాలం నెట్టుకొస్తే,ప్రజల్లో అసంతృప్తి మరింత పెరుగుతుందని, అప్పుడు జగన్ పర్యటనలకు వెళితే మరింత ఉత్సాహంగా క్యాడర్ పాల్గొనే అవకాశముంటుందని పార్టీ నేతలే చెబుతున్నారు. జగన్ ఇప్పటి నుంచి జిల్లాల పర్యటనకు వస్తే అనవసరపు ఖర్చు తప్ప మరో ప్రయోజనం ఉండదని కూడా చెబుతున్నారు. అందుకే జగన్ పర్యటనలకు క్యాడర్ నుంచి పెద్దగా రెస్పాన్స్ ఉండకపోవచ్చని, కేవలం అభిమానులు, జనం మాత్రమే హాజరవుతారన్న అంచనాలు వినిపడుతున్నాయి.

# ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకం

ఆలోచించలేదని దళితులకు రిజర్వేషన్ ఇచ్చారన్నారు. కాకా కాలేజీలో ఎక్కడా మాల, మాదిగ అని తేడా ఉండదన్నారు. కాకా గుడిసెలు ఇచ్చినప్పుడు కూడా మాల, మాదిగ అని మాట్లాడలేదన్నారు వివేక్. రాజకీయ పార్టీల్లో మాలలంటే చిన్న చూపు ఉందన్నారు. అలాంటి వారికి ఈ సభ చెంప పెట్టని అన్నారు. మనం ఐక్యంగా ఉంటేనే మనకు గౌరవం లభిస్తుందని మాలలను ఉద్దేశించి వివేక్ వ్యాఖ్యానించారు. మాలల సింహ గర్జన సభకు ఇంత జనం హాజరవుతారని ఎవరూ ఊహించలేదని సంతోషం వ్యక్తం చేశారు. కుల వివక్ష చూసే అంబేద్కర్ రాజ్యాంగంలో మనకు రిజర్వేషన్లు కల్పించారని కానీ, ఇవాళ ఆ రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్ర జరుగుతోందన్నారు వివేక్. ముందు క్రిమిలేయర్ అంటారు ఆ తర్వాత రిజర్వేషన్లు ఎత్తివేస్తారన్నారు. మాలలపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మాలలు అంతా ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. గతంలో కేసీఆర్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తే ఎన్నో పదవులు ఇస్తామంటూ ఆపర్లు వచ్చాయని వాటన్నింటినీ తృణప్రాయంగా విడిచిపెట్టానని వివేక్ చెప్పారు. మాలల కోసం పోరాటం చేస్తోన్న తనపై ఈడీ దాడులు చేసినా వెనక్కి తగ్గలేదన్నారు. మరోవైపు, కాంగ్రెస్ సీనియర్ నేత, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ మాలల కోసం తన కుటుంబం ఎంతో కష్టపడిందన్నారు. మాల కులాన్ని కాపాడే బాధ్యత తమపై ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఈ ఏడాది ఆగస్టు 1న తప్పుడు తీర్పు ఇచ్చిందని ఆ తీర్పును వ్యతిరేకించేందుకు మాలలంతా ఇక్కడికి వచ్చారన్నారు వినోద్. తక్కువ సంఖ్యలో ఉన్న మాలలు ఎక్కువ దోచుకుతింటున్నారంటూ విమర్శిస్తున్నారని మాలలు ఎవరిదేం దోచుకున్నారని ప్రశ్నించారు. మాలల సింహగర్జన సభకు ఢిల్లీ నుంచి వచ్చిన పాశ్వాన్ మాట్లాడుతూ తెలంగాణ, ఏపీలోనే కాదు ఢిల్లీలో కూడా వర్గీకరణపై చర్చ జరగాలన్నారు. ఢిల్లీ వరకు మాలల పోరాటం చేరితే ప్రధాని మోడీ కుర్చి కదలాలని పాశ్వాన్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై మాలలు ఉద్యమిస్తారని తేలిపోయిందన్నారు. పార్లమెంటులో మాలల గురించి చర్చ జరగాలన్నారు.

# సంభల్ మసీదు వారసత్వ కట్టడం..

లక్నో: ఉత్తరప్రదేశ్ సంభల్‌లోని మొఘల్ కాలం నాటి షాహీ జామా మసీదు రక్షిత వారసత్వ కట్టడమని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) తెలిపింది. ఈ నేపథ్యంలో రక్షణ కోసం ఆ మసీదుపై నియంత్రణ, నిర్వహణను తమకు అప్పగించాలని కోర్టును కోరింది. శుక్రవారం సంభల్ కోర్టులో ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసింది. అలాగే ఆ మసీదులో సర్వే జరుపాలన్న కోర్టు ఆదేశంపై ప్రతివాదనను సమర్పించింది. ఏఎస్ఐ తరపు న్యాయవాది విష్ణు శర్మ దీని గురించి మీడియాతో మాట్లాడారు. మసీదు సర్వే, స్థల పరిశీలనను మసీదు నిర్వహణ కమిటీ, స్థానికులు అడ్డుకున్నారని తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా మసీదు మెట్లపై స్టీల్ రెయిలింగ్ ఏర్పాటు గురించి 2018 జనవరి 19న మసీదు కమిటీపై కేసు నమోదైన సంగతిని కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.కాగా, సంభల్‌లోని మొఘల్ కాలం నాటి షాహీ జామా మసీదును రక్షిత స్మారక చిహ్నంగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) 1920లో ప్రకటించిందని న్యాయవాది విష్ణు శర్మ తెలిపారు. దీంతో ఆ నిబంధనల మేరకు ఏఎస్ఐ అనుమతి లేకుండా ఆ మసీదులోకి రాకపోకలు, అనధికారిక మార్పులు చట్టవిరుద్ధమని చెప్పారు. ఈ నేపథ్యంలో రక్షిత వారసత్వ కట్టడమైన ఆ మసీదుపై నియంత్రణ, నిర్వహణను ఏఎస్ఐకు అప్పగించాలని కోర్టును కోరినట్లు వెల్లడించారు. ఈ అభ్యర్థనను కోర్టు పరిశీలించే అవకాశమున్నదని అన్నారు.మరోవైపు గతంలో అక్కడున్న ఆలయాన్ని కూల్చి ఆ మసీదును నిర్మించినట్లు ఒక వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. దీని గురించి సర్వే చేయాలని స్థానిక కోర్టు ఆదేశించింది. నవంబర్ 24న సర్వే కోసం వెళ్లిన బృందాన్ని స్థానికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఘర్షణ చెలరేగింది. ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతోపాటు పలు వాహనాలకు నిప్పుపెట్టారు. పోలీసులు లాఠీచార్జ్ చేయడంతోపాటు బాష్పాయువు ప్రయోగించారు. కాగా, ఈ హింసాకాండలో నలుగురు వ్యక్తులు మరణించగా పోలీసులతో సహా 30 మందికిపైగా గాయపడ్డారు. ఈ హింసాకాండపై దర్యాప్తు కోసం ముగ్గురు సభ్యులతో జ్యుడీషియల్ కమిషన్‌ను సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మరోవైపు హింస నేపథ్యంలో ఆ మసీదులో సర్వేను సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది.

# 6 అబద్ధాలు 66 మోసాలు

ఏడాది పూర్తి అయ్యింది. తెలంగాణ ప్రజలు గత సంవత్సరకాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వంతో కంటే ఎక్కువ కష్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నారు అని కిషన్ రెడ్డి విమర్శించారు. పాలకులు మారిన పాలనా విధానం మారలేదు అన్నట్టు తెలంగాణ ప్రజలు మార్పు కోసం ఓటేశారు కానీ కాంగ్రెస్ గ్యారంటీల గారడీనీ ఏడాదిలోనే తెలుసుకున్నారు అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ మొత్తం కాంగ్రెస్ గ్యారంటీల గారడి 6 అబద్ధాలు 66 మోసాల పేరిట ప్రజలను బీజేపీ పార్టీ చైతన్యం చేయనుంది. గ్యారంటీలు, హామీలు, డిక్లరేషన్ల పేరుతో మాయమాటలు చెప్పి, అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్ర స్థాయిలో బీజేపి పార్టీ ఎండగడుతుంది అని కిషన్ రెడ్డి తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 9న అందరికీ రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది కానీ ఏడాది గడిచినా రుణమాఫీ పూర్తి కాలేదని అన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ. 15 వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా రైతు భరోసా ఇవ్వలేదని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందన్నారు. పదేళ్లపాటు నియంతృత్వపాలన, కుటుంబ పాలన, అవినీతి పాలన సాగిందని విమర్శించారు. నిరంకుశ, అవినీతి పాలనను పదేళ్ల తర్వాత ప్రజలు గద్దె దించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనకు ఏమాత్రం తేడాలేదని కిషన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని కత్రియ హోటల్ వేదికగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ ఛార్జ్ షీట్ ను విడుదల చేసే కార్యక్రమంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, బీజేపీ ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, రామారావు పాటిల్, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాల్వాయి హరీశ్, పైడి రాకేష్ రెడ్డి, బీజేపీ నేతుల పాల్గొన్నారు.

# దండకారణ్యంలో అలజడి

అటవీ గ్రామాలు గుడారాల్లో వణికిపోతున్నాయి. పచ్చని అడవిలో రక్తపు వర్షం కురుస్తోంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఇలాంటి భయానక పరిస్థితి నెలకొంది. తాజాగా ఆదివారం తెలంగాణలో మావోయిస్టుల ఎన్ కౌంటర్ కలకలం రేపింది. ములుగు జిల్లాకు చెందిన ఏటూరునాగారంలో చల్పాక అడవుల్లో గ్రేహౌండ్స్ దళాలకు మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఇరువైపుల నుంచి ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తోంది. వీరిలో ఒకరు ఇల్లందు-నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి బద్రు అని చెబుతున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో ఇంకా ఎవరైన మావోయిస్టులు ఉన్నారో తెలుసుకునే పనిలో పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఘటనా స్థలంలో భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. వాటిలో రెండు 2 ఏకే 47 రైఫిల్స్ ఉన్నట్లు తెలిసింది.

**- కీలక నేత హతం**

దట్టమైన అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య కాల్పులు చాలాసేపు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఏడుగురు మావోయిస్టులను గ్రేహౌండ్స్ దళాలు హతమార్చాయి. తెలంగాణ గ్రేహౌండ్స్, యాంటీ మావోయిస్ట్ స్క్వాడ్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ ను చేపట్టినట్లు తెలుస్తోంది. మృతుల్లో మావోయిస్టు కీలక నేతలున్నట్లు సమాచారం. మరణించిన మావోయిస్టుల్లో ఇల్లందు నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శి భద్రు అలియాస్ పాపన్నతో పాటు అతడి దళానికి చెందిన సభ్యులు హతమైనట్లు తెలుస్తోంది. చనిపోయిన వారిలో కురుసం మంగు అలియాస్ భద్రు అలియాస్ పాపన్న (35), ఎగోలపు మల్లయ్య అలియాస్ మధు(43), ముస్సకి దేవల్ అలియాస్ కరుణాకర్(22), ముస్సకి జమున (23), జైసింగ్ (25), కిశోర్ (22), కామేశ్(23) ఉన్నట్లు తెలుస్తోంది.

**- తెలంగాణలో మావోల అలజడి**

కొంతకాలంగా తెలంగాణ రాష్ట్రంలో నక్సలైట్ల కదలికలు దాదాపు ఆగిపోయాయి. తెలంగాణకు పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలలో మాత్రం మావోలు తమ కార్యకలాపాల్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఐతే ఇటీవల తరచూ జరుగుతున్న అన్ని ఎన్‌కౌంటర్లలో భద్రతా బలగాలదే పై చేయి సాధిస్తున్నాయి. ఈ క్రమంలో మావోయిస్టు వ్యవస్థను పూర్తిగా రూపుమాపుతామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించిన సంగతి తెలిసందే. అందుకోసం 2027 నాటికి ఈ లక్ష్యాన్ని సాధిస్తామని ధీమాను వ్యక్తం చేశారు.

మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పరిస్థితుల్లో తాజాగా తెలంగాణలో నక్సలైట్లు తిరుగుతుండడం చర్చనీయాంశంగా మారింది. అసలు ములుగు జిల్లాలోకి మావోయిస్టులు ఎలా వచ్చారు? ఎందుకొచ్చారు? దట్టమైన అడవుల్లో వాళ్లు ఏం చేస్తున్నారు? భవిష్యతులో దేనికోసమైన ఏదైనా పెద్ద ప్లాన్ వేస్తున్నారా? పెద్ద కుట్రకు ప్లాన్ చేస్తున్నారా ? మొత్తం ఇంకా ఎంత మంది మావోయిస్టులు ఉన్నారు? ఇలా ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కూంబింగ్ తర్వాత గ్రేహౌండ్స్ బలగాలు చెప్పే విషయాన్ని బట్టి మావోల కదలికలపై ఓ అంచనాకు వచ్చే వీలుంటుంది.

# అన్నదాతలకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్

సొమ్ము జమ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మారీచుల మాటలు నమ్మొద్దని సోనియా గాంధీ గ్యారెంటీగా తాను చెబుతున్నట్లు వెల్లడించారు. రైతు భరోసాపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో సబ్ కమిటీ వేశామని త్వరలోనే విధివిధానాలు ఖరారు చేస్తామని చెప్పారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ ఎలా పూర్తి చేశామో రైతు భరోసా హామీ కూడా అలాగే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. అలాగే, రేషన్ కార్డులపై సన్నబియ్యం పంపిణీ చేస్తామని చెప్పారు.

**- అప్పులున్నా సంక్షేమ పాలన అందిస్తున్నాం**

'మాజీ సీఎం కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పుతో మాకు ప్రభుత్వాన్ని అప్పగించారు. సర్కారు ఇంత అప్పుల్లో ఉందని కేసీఆర్, హరీశ్ రావు, ఆర్థిక మంత్రిగా పని చేసిన ఈటల రాజేందర్, అధికారులు ఎవరూ మాకు చెప్పలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర ఆస్తులు, అప్పులపై శ్వేతపత్రం విడుదల చేశాం. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రతి నెలా రూ.6,500 కోట్ల వడ్డీ చెల్లిస్తున్నాం. భారీగా అప్పు ఉన్నా అధైర్యపడకుండా పాలన సాగిస్తున్నాం. కేసీఆర్ బకాయి పెట్టిన రూ.7,625 కోట్ల రైతు బంధు బకాయిలు మేం అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లించాం. ఇప్పటివరకూ 25.35 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణాలు మాఫీ చేశాం. మిగతా 9 ఏళ్లు కూడా అన్ని కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహిస్తామనే నమ్మకం కలిగింది. రైతులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నది కాంగ్రెస్ పార్టీయే. ఇది అప్పటి నెహ్రూ నుంచి ఇప్పటివరకూ జరిగింది. రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను పదేళ్ల పాటు మోసం చేసింది.' అంటూ సీఎం రేవంత్ మండిపడ్డారు.

**- రైతుల ఆశీర్వాదమే గొప్ప శక్తి**

పాలమూరులో జరిగిన రైతు పండుగలో వేలాది మంది రైతులు పాల్గొని ఆశీర్వాదం ఇచ్చారని రైతుల ఆశీర్వాదం ప్రభుత్వానికి గొప్ప శక్తిని ఇచ్చిందని సీఎం రేవంత్ తెలిపారు. 'వాస్తవాల ప్రాతిపదికన మా ప్రభుత్వం భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుంటోంది. రైతును రాజును చేయడమే లక్ష్యంగా మా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. రుణమాఫీ, ఉచిత విద్యుత్, సబ్సిడీ ఎరువులు, మద్దతు ధర, ఉపాధి హామీ పథకం లాంటి వాటితో రైతులను ఆదుకుంటున్నాం. ఇప్పటి వరకు 31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మా ప్రభుత్వం సేకరించింది. వచ్చే సీజన్ కూడా రూ.500 బోనస్ కొనసాగుతుంది. సంక్షేమ హాస్టళ్లలో పిల్లలకు సన్న బియ్యంతో భోజనం పెడతాం. రూ.2 లక్షల వరకు వంద శాంత రుణమాఫీ పూర్తైంది. రేషన్ కార్డు లేని వారికి కూడా రుణమాఫీ అయింది.' అని స్పష్టం చేశారు.

# ఉత్కంఠకు తెర పడుతుందా?

తన స్వగ్రామం వెళ్లిపోవడంతో ఆ సమావేశం జరగలేదు. దాంతో, సీఎం పదవిపై పీట ముడి పడింది. మీడియాతో మాట్లాడిన షిండే సీఎం పదవి అంశంపై స్పందించారు. మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నదానిపై నేడు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. "నేను ఇప్పటికే ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మాట జవదాటనని బేషరతుగా మద్దతు ఇచ్చాను. మహారాష్ట్ర కోసం వారు ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని తెలిపాను" అని షిండే వెల్లడించారు. అంతేకాదు, షిండే తన అస్వస్థత గురించి తొలిసారిగా మాట్లాడారు. అనారోగ్యం నుంచి కోలుకుంటున్నానని, ప్రస్తుతం తన స్వగ్రామం దరే తాంబ్ లో విశ్రాంతి తీసుకుంటున్నానని చెప్పారు. గత రెండున్నరేళ్లుగా విశ్రాంతి తీసుకోకుండా పనిచేశానని, అందుకే ఇప్పుడు అనారోగ్యానికి గురయ్యానని వివరించారు.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి ఘనవిజయం సాధించింది. సొంతంగా బీజేపీ 132 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. శివసేన (షిండే) 57 స్థానాలతో సరిపెట్టుకుంది. దాంతో, బీజేపీ నేత, గత ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్ మహారాష్ట్ర తదుపరి సీఎం రేసులో ముందు నిలిచారు. ఫడ్నవీస్ నే తదుపరి సీఎం చేయాలన్నది బీజేపీ అధిష్ఠానం నిర్ణయంగా తెలుస్తోంది. ఇప్పుడు షిండే వ్యాఖ్యలతో ఫడ్నవీస్ కు ప్రధాన అడ్డంకి తొలగిపోయినట్టే భావించాలి. ఏదేమైనా రేపటితో ఈ సస్పెన్స్ కు తెరపడనుంది.

# శ్రీశైలంలో డిసెంబరు 1వ తేదీతో వైభవంగా ముగిసిన కార్తీకమాసోత్సవాలు

## గత నెల 2వ తేదీన ప్రారంభమైన కార్తీక మాసోత్సవాలు డిసెంబర్ 1వ తో ముగిశాయి.







**శ్రీశైలం (ప్రశ్న న్యూస్)** ఈ ఉత్సవాల నిర్వహణకు దేవస్థానం పలు విస్తృత ఏర్పాట్లను చేయడం జరిగింది. ముఖ్యంగా భక్తులకు వసతి, మంచినీటిసరఫరా, సౌకర్యవంతమైనదర్శనం, అన్నప్రసాదవితరణ, పారిశుద్ధ్యం నిర్వహణ తదితర ఏర్పాట్లు చేయబడ్డాయి. అలాగే కార్తీక సోమవారాలలో లక్షదీపోత్సవం, పుష్కరిణిహారతి, కార్తీకపౌర్ణమిరోజున జ్వాలాతోరణోత్సవం, పుణ్యనదీహారతిలకు సంబంధించి పలు ఏర్పాట్లు చేయడం జరిగింది. అలాగే కార్తీకమాసంలో రద్దీరోజులందు భక్తులకు సేవలు అందించేందుకుగాను కార్యాలయ సిబ్బందికి ప్రత్యేక విధులను కూడా కేటాయించడం జరిగింది.

**దర్శనం ఏర్పాట్లు :** వేకువజామున గం. 3.00లకు ఆలయద్వారాలు తెరచి, ప్రాతకాల పూజల అనంతరం వేకువజామున గం. 4.30ల నుంచి సాయంకాలం గం. 4.00ల వరకు దర్శనాలు, తిరిగి సాయంత్రం గం. 5.30ల నుంచి రాత్రి గం. 11.00ల వరకు కూడా దర్శనాలు కొనసాగేలా చర్యలు తీసుకోబడ్డాయి. రద్దీరోజులలో రెండువిడతలుగా రుద్రహోమం, మృత్యుంజయహోమం జరిపించబడ్డాయి. క్యూ కాంప్లెక్సోలోని భక్తులకు నిరంతరం మంచినీరు, అల్పాహారం అందేలా చర్యలు తీసుకోవడంజరిగింది. భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు వీలుగా కార్తీకమాసంలో శ్రీస్వామివారి గర్భాలయ ఆర్జిత అభిషేకాలు పూర్తిగా నిలిపివేయబడ్డాయి. అదేవిధంగా రద్దీరోజులలో సామూహిక ఆర్జిత అభిషేకాలు కూడా నిలుపుదల చేయడం జరిగింది. రద్దీరోజులలో (మొత్తం కార్తికమాసం 16 రోజులు) శ్రీస్వామివార్ల స్పర్శదర్శనం కూడా నిలుపుదల చేయబడింది. ఈ రోజులలో అందరికీ కూడా అలంకార దర్శనం మాత్రమే కల్పించబడ్డాయి. సాధారణ రోజులలో రోజుకు మూడు విడతలుగా నిర్దిష్టవేళలో మాత్రమే సామూహిక ఆర్జిత అభిషేకములకు, శ్రీస్వామివారి స్పర్శదర్శనానికి వీలు కల్పించడం జరిగింది. కార్తీకమాసంలో వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన సంఖ్యలో లడ్డూ ప్రసాదాలను అందుబాటులో వుంచడం జరిగింది. భక్తులు కార్తీకదీపారాధన చేసుకునేందుకు వీలుగా ఆలయ ఉత్తరమాడవీధి మరియు గంగాధరమండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగింది. ఉత్తరమాడవీధిలో ఉసిరిక చెట్ల కుండీలన కూడా ఏర్పాటు చేయడం జరిగింది. కార్తీకసోమవారాలలో మరియు పౌర్ణమిరోజున "పుష్కరిణి" వద్ద లక్షదీపోత్సవం మరియు పుష్కరిణి హారతి కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. నవంబరు 15న కార్తీకపౌర్ణమి సందర్భంగా పాతాళగంగలో సారె సమర్పణ, పుణ్యనదీహారతి కార్యక్రమం జరిపించబడ్డాయి. అదేవిధంగా అక్కడగల కృష్ణవేణీ విగ్రహానికి పూజాదికాలు సమర్పించబడ్డాయి. కార్తీక పౌర్ణమిరోజున సాయంకాలం గంగాధర మండపం వద్ద జ్వాలాతోరణోత్సవం జరిపించబడింది. ప్రతీరోజు ఆలయంలో ఆకాశదీపం వెలిగించబడింది.

# ది రిమాండ్ ఖైదీ కహానీ

## జ్యు డీషియల్ కస్టడీలో జైళ్ల శాఖలో జలగల గలాట

- విచక్షణాధికారాలు మాని విచారణ ఖైదీకి బాధ్యతల అప్పగింత పాత బెయిల్ పత్రాల ట్యాంపరింగ్..పి టి వారెంట్ తో బెడిసి కొట్టిన వ్యూహం
- జైలు అధికారులనే బురిడీ కొట్టించిన రిమాండ్ ఖైదీ
- నకిలీ బెయిల్ పత్రాలు సృష్టించి చంచల్ గూడ జైలు నుంచి విడుదలైన రిమాండ్ ఖైదీ
- నకిలీ బెయిల్ పత్రాల వ్యవహారంలో ఖాకీలకు కొత్త తలనొప్పులు
- జైలు సూపరిండెంట్ సెలవులో.. విచారణ ఖైదీ వలపులో..రిమాండ్ ఖైదీ




**హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్)** చంచల్‌గూడ కేంద్ర కారాగారం.. అక్కడ ఉన్నతాధికారులు బెయిల్ విభాగంలో ఓ విచారణ ఖైదీకి అత్యంత కీలకమైన బాధ్యతలను అప్పగించారు. "పేనుకు పెత్తనమిస్తే తలంతా గొరిగినట్లు".. ఆ విచారణ ఖైదీ నకిలీ బెయిల్ పత్రాలను పాస్ చేసి..మరో అండర్ ట్రయలర్ ఖైదీ విడుదలకు కారణమయ్యాడు. దీంతో అధికారులు ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు. హైదరాబాద్ సంతోష్‌నగర్ హెచ్ఐజీ కాలనీకి చెందిన మీర్ సుజాత్ అలీఖాన్ పై చీటింగ్ కేసులున్నాయి .(జంతువులచట్టం) జంతువుల హత్య,వాటికి విషం పెట్టడం వంటి నేరాలకు సంబంధించి గతంలో అరెస్టయిన సుజాత్ అలీ..చంచల్‌గూడ జైలులో అండర్ ట్రయల్(యూటీ 5549)గా ఉన్నాడు.అక్టోబరు 17న ఆ కేసులో బెయిల్ రావడంతో విడుదలయ్యాడు. నవంబరు 2న నార్సింగ్ ఠాణాలో.. బీఎన్ఎస్‌లోని సెక్షన్లు 318, 144, 338, 336(3), 340(2) కింద కేసు నమోదైంది.పోలీసులు అతన్ని అరెస్టు చేసి, చంచల్‌గూడ జైలుకు రిమాండ్ చేశారు. అండర్ ట్రయల్(యూటీ 6687)గా ఉన్న సుజాత్ అలీ..బెయిల్ విభాగంలో పనిచేసే రాము అనే మరో విచారణ ఖైదీ(యూటీ 4831)ని మచ్చిక(దోస్తీ) చేసుకున్నాడు.ఆ తర్వాత.. పాత బెయిల్ పేపర్లను ఫోర్జరీ/ట్యాంపర్ చేసి ఇస్తే..దాన్ని పాస్ చేయాలని..అందుకు భారీ మొత్తంలో ప్రతిఫలం ఇస్తానంటూ రాముతో ఒప్పందం కుదుర్చుకున్నాడు.

### కుతంత్రం ఇలా అమలైందిలా

ములాఖత్ సమయంలో తనవారిని కలిసిన సుజాత్ అలీ..వ్యూహాన్ని వారికి వివరించి..పాత బెయిల్ పత్రాలను ట్యాంపర్ చేయించాడు.కొత్త తేదీలతో తాజా కేసులో బెయిల్ వచ్చినట్లుగా పత్రాలను సృష్టించాడు.ఆ నకిలీ బెయిల్ పత్రాలను రాముకు అందజేశాడు.రాము ఆ పత్రాలు కోర్టు నుంచి



వచ్చినట్లుగా ధ్రువీకరిస్తూ.. స్టాంపింగ్ చేశాడు.దాంతో ఉన్నతాధికారులు ఆ బెయిల్ పత్రాలు నిజమైనవేనని భావించి, నవంబరు 26న అలీని విడుదల చేశారు.

### పీటీ వారెంట్‌తో వెలుగులోకి వచ్చిన నిజం

వాస్తవానికి విడుదలైన సుజాత్ అలీపై జైళ్ల శాఖ అధికారులు మరోమారు ఫోకస్ చేసి ఉండేవారు కాదు. అయితే 'కానూన్ కా హాంత్ లంబా హెూతాహై' అన్నట్లుగా మూడ్రోజుల్లోనే సుజాత్ అలీ మోసం వెలుగులోకి వచ్చింది. మరో చీటింగ్ కేసులో దర్యాప్తు అధికారులు కోర్టు అనుమతితో సుజాత్ అలీని కస్టడీలోకి తీసుకునేందుకు పీటీ వారెంట్ దాఖలు చేశారు. దానికి కోర్టు ఆమోదించడంతో నవంబరు 29న పీటీ వారెంట్‌తో చంచల్‌గూడ జైలుకు చేరుకుని, సుజాత్ అలీని తమకు అప్పగించాలంటూ చంచల్‌గూడ జైలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. దాంతో జైళ్ల శాఖ అధికారులు, సిబ్బంది ఒక్కసారిగా ఖంగుతిన్నారు.జైలులో ఉన్నవారికే పీటీ వారెంట్ వర్తిస్తుంది.అలాంటిది విడుదలైన సుజాత్ అలీకి పీటీ వారెంట్ రావడంపై ఆశ్చర్యపోయారు. దీనిపై ఆరా తీస్తే..అతని బెయిల్ పత్రాలు నకిలీవని తేలింది.దీంతో జరిగిన మోసాన్ని గుర్తించి, డబీర్‌పూర పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఇప్పుడు ఏం చేయాలా.? అని తలలు పట్టుకుంటున్నారు జైళ్ల శాఖ అధికారులు. సుజాత్ అలీని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

### అసలు తప్పెవరిది.?

సుజాత్ అలీ నకిలీ బెయిల్ పత్రాల వ్యవహారం రాష్ట్ర జైళ్ల శాఖలో సంచలనంగా మారింది ఈ వ్యవహారం. నిజానికి ఈ వ్యవహారాలను జైలు సూపరింటెండెంట్ పర్యవేక్షించాలి.అయితే ప్రస్తుత సూపరింటెండెంట్ కుమార్తె పెళ్లి కారణంగా వారం రోజుల క్రితం నుంచే సెలవుల్లో ఉన్నారు.కేంద్ర కారాగారంలో అందులోనూ వీవీఐపీ ఖైదీలు ఉండే జైలులో సూపరింటెండెంట్ సెలవులో ఉంటే,మరో జైలు సూపరింటెండెంట్ లేదా సీనియర్ డీఎస్పీకి బాధ్యతలను అప్పగించాలి. కానీ పోలీస్ శాఖ ఉన్నతాధికారులు అలా చేయకుండా..నిత్యం బిజీగా ఉండే డీఐజీ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. ఇక కీలకమైన బెయిల్ విభాగంలో దొంగతనం కేసులో అరెస్టయిన విచారణ ఖైదీ రాముకు బాధ్యతలను అప్పగించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. జైళ్ల శాఖ నిబంధనల ప్రకారం.. విచారణ ఖైదీలకు ఎలాంటి బాధ్యతలను అప్పగించరాదు. జైళ్ల కర్మాగారాల్లోనూ పనులు చేయించకూడదు. చంచల్‌గూడలో ఆ నిబంధనలను తుంగలో తొక్కినట్లు స్పష్టమవుతోంది. ఇక బెయిల్ పత్రాలను పరిశీలించాల్సిన అధికారులు కూడా ఖైదీ స్టాంపు వేయడంతో గుడ్డిగా ఆమోదించడం అనుమానాలకు తావిస్తోంది. ఈ వ్యవహారంపై జైళ్ల శాఖ డీఐజీ వివరణకు ' ప్రయత్నించగా.ఫోన్ అందుబాటులోకి రాలేదు. ఇతర అధికారులు,సిబ్బంది ఈ విషయాన్ని ధ్రువీకరించడానికి సుముఖత కనబర్చడం లేదు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ జనరల్ పోలీస్ (డిజిపి) వాస్తవాలు వెల్లడించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మేధావులు డిమాండ్ చేస్తున్నారు.

# బంగ్లాదేశ్‌లో మైనార్టీలను తరిమివేసే విద్వేష క్రీడ!

ఈ ఏడాది జులైలో ప్రధాని షేక్ హసీనా అధికారం నుంచి వైదొలిగిన నాటి నుంచి బంగ్లాదేశ్ లోని హిందూ మైనార్టీలు లక్ష్యంగా తీవ్ర స్థాయిలో దాడులు జరుగుతున్నాయి. హసీనాను దించివేసే క్రమంలో మొదలైన అల్లర్లు, దారుణాలు పెరుగుతున్నాయే కానీ తగ్గ లేదు. హిందవులు లక్ష్యంగా ఈ అల్లర్లు సాగుతూనే ఉన్నాయి. ఆధ్యాత్మికవేత్త చిన్మయ్ కృష్ణదాస్ అరెస్ట్ ఆ దేశంలో మైనారిటీల దుస్థితికి తాజా ఉదాహరణ. మైనారిటీల హక్కుల కోసం గళం విప్పే దాస్ బంగ్లాదేశీ జాతీయ పతాకాన్నిఅవమానించారంటూ దేశద్రోహ నేరం మోపారు. ఆయనను అరెస్ట్ చేసి, బెయిలివ్వకుండా కస్టడీకి పంపారు. అంతేకాదు, అంతర్జాతీయ శ్రీకృష్ణ సమాజం(ఇస్కాన్)పై నిషేధం విధించనున్నట్టు బంగ్లా సర్కార్ ప్రకటించింది. ప్రస్తుతం ఆ పక్రియ కొనసాగుతోందని అటార్నీ జనరల్(ఏజీ) వెల్లడించారు. ప్రభుత్వం ఇస్కాన్ ని మత సంస్థగా పేర్కొంది. చిన్మయ్ అరెస్టు నేపథ్యంలో ఈ ప్రకటన తీవ్ర దుమారం రేపుతోంది. ఇస్లాం అధికారిక మతమైనా, లౌకికవాద, ప్రజాస్వామ్య దేశంగా, సమానత్వానికి రాజ్యాంగ బద్ధులమని చెప్పుకొనే బంగ్లా ఆ మాటకు తగ్గట్టు వ్యవహరించడం ఎప్పుడో మానేసింది. అందుకు తగ్గట్టే తాజాగా 'ఇస్కాన్'ను ర్యాడికల్, మత ఛాందసవాద సంస్థ అని బంగ్లా అటార్నీ జనరల్ అభివర్ణించడం ఆందోళనకరం. ఆధ్యాత్మిక చైతన్యం, పీడిత జన సముద్ధరణ కోసం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 150 దేశాల్లో పనిచేస్తున్న ఒక సంస్థపై అలాంటి నిర్ణయం తీసుకోవాలనుకోవడం బుద్ధిలేని పని. మరోవైపు, చిన్మయ్ అరెస్టును భారత ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలు పాకిస్థాన్‌ను తలపిస్తోందని అధికార బీజేపీ నేతలు మండిపడుతున్నారు. తగిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. ÷రస్తుతం బంగ్లాదేశ్‌లోభారత్‌పై వ్యతిరేక ప్రచారాన్ని పెంచే కార్యక్రమం నడుస్తోంది. తీవ్రవాద శక్తులను ప్రోత్సహించడం వంటివి బంగ్లాదేశ్‌ను పూర్తి అరాచక రాజ్యంగా మారుస్తున్నా యన్నారు. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం చర్యలే ఇందుకు కారణమని చెప్పాలి. హిందూ, బౌద్ధ దేవాలయాలపై దాడులు తరచూ జరుగుతున్నాయి. దేశంలో ఏదో ఒక చోట మైనార్టీలు, ముఖ్యంగా హిందువులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. షేక్ హసీనా రాజీనామా అనంతరం.. గతంలో నిషేధానికి గురైన 'బంగ్లాదేశ్ జమాతే ఇస్లామీ' వంటి తీవ్రవాద సంస్థలు మళ్లీ రెచ్చిపోతున్నాయి. ఈ తీరును చూస్తుంటే మైనార్టీ వ్యతిరేక భావజాలం పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. హసీనా వెళ్లిపోయిన తర్వాత బంగ్లాదేశ్‌లో రాజకీయ శూన్యత ఏర్పడింది. అదే సమయంలో తీవ్రవాద సంస్థలు మళ్లీ రెచ్చిపోతుండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వీటిలో విదేశీ జోక్యం ఉందనే వారి వాదనను కొట్టిపారేయలేము. ఢాకాలోని పాక్ రాయబార సంస్థ ముందు చోటుచేసుకుంటున్న కార్యకలాపాలు ఇందుకు ఉదాహరణ. కొన్ని తీవ్రవాద సంస్థలతో పాకిస్థాన్ సన్నిహితంగా మెలుగుతోందనేది బహిరంగ రహస్యం. మైనారిటీలను పూర్తిగా తరిమేసి, బంగ్లాను హిందూ రహిత దేశంగా మార్చాలనే కుట్ర దీని వెనక ఉన్నట్టు కనిపిస్తోంది. ఈ అల్లర్లు, అల్పసంఖ్యాక హిందువులపై దాడుల వెనుక మత ఛాందస జమాతే ఇస్లామీ ఉందనేది స్పష్టం. హసీనా సర్కారు కాలంలో నిషేధానికి గురైన ఈ ర్యాడికల్ గ్రూపు, అలాగే బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ)లు యూనస్ యంత్రాంగంలో భాగమే. అసలు ఈ ప్రయత్నమంతా ఇస్లామిక్ షరియత్‌ను ప్రవేశపెట్టి, బంగ్లాదేశ్‌ను ప్రజాస్వామ్య ఎన్నికలు, పార్లమెంట్‌తో పని లేని దేశంగా మార్చాలనే వ్యూహంలో భాగమని ఒక వాదన వినిపిస్తోంది. మరోవైపు, జూలై నాటి ప్రజా ఉద్యమంతో ఆఫ్గనిస్తాన్ లాగానే బంగ్లాను తమ ప్రయోగశాలగా చేసుకోవాలని పాశ్చాత్య ప్రపంచం భావిస్తున్నట్టుంది.

అప్పుడిక బంగ్లా మరో తీవ్రవాద కేంద్రంగా మారే ప్రమాదముంది. అది భారత్‌కే కాదు... యావత్ ప్రపంచానికి నష్టం. నిజానికి, ఆసియా ? పసిఫిక్ కూటమిలో బంగ్లాను భాగం చేసుకొని, లబ్ది పొందాలని అమెరికా భావించింది. హసీనా సర్కార్ అందుకు ఒప్పుకోకపోవటంతో అది కుదరలేదు. మొన్నటి అమెరికా ఎన్నికల్లో ట్రంప్ గెలవడం బంగ్లాకు చెడు పరిణాయం. మధ్యంతర సర్కార్ సారథి ప్రొఫెసర్ మహమ్మద్ యూనస్ కు ట్రంప్ ద్వేషి గా పేరుంది.

## ఇజ్రాయెల్- హిజ్బొల్లా

# కాల్పుల విరమణ ఒప్పందం



ఇజ్రాయెల్, హిజ్బొల్లా మధ్య 13 నెలల పోరాటానికి తెరపడింది. ఇరు వర్గాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు.ఈ ఒప్పందం బుధవారం నుంచి అమలులోకి వచ్చింది. లెబనాన్‌లో పోరాటాన్ని నిలిపివేసి, 'హిజ్బొల్లా, ఇతర ఉగ్రవాద సంస్థల నుంచి ఇజ్రాయెల్‌ను రక్షించడం' ఈ ఒప్పందం లక్ష్యం అని యుఎస్, ఫ్రాన్స్ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. 'శాశ్వత కాల్పుల విరమణ' లక్ష్యంగా ఈ ఒప్పందం జరిగిందని బైడెన్ ప్రకటించారు. ఒప్పందంలో భాగంగా, 60 రోజులలో హిజ్బొల్లా బ్లూ లైన్ (లెబనాన్, ఇజ్రాయెల్ మధ్య అనధికారిక సరిహద్దు), లిటాని నదికి (ఉత్తర దిశకు సుమారు 30 కి.మీ దూరం) మధ్య ఉన్న ప్రాంతం నుంచి తన ÷టైర్లను, ఆయుధాలను తొలగిస్తుంది. లెబనాన్ సైన్యం ఆ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకుంటుంది. ఆయుధాలు, సైనిక నిర్మాణాలు తొలగిస్తారు, వాటిని మళ్లీ అక్కడ పునర్నిర్మించకుండా చూసుకుంటాయి. అదే 60 రోజులలో ఇజ్రాయెల్ నెమ్మదిగా తన దళాలను, పౌరులను అక్కడి నుంచి ఉపసంహరించుకుంటుంది. సరిహద్దుకు ఇరువైపులా ఉన్న ప్రజలు తమ ఇళ్లకు తిరిగి రావడానికి ఇది వీలు కల్పిస్తుందని బైడెన్ చెప్పారు.అమెరికా అధికారి ప్రకారం.. దక్షిణాన హిజ్బుల్లా స్థానంలో ఐదు వేల మందితో కూడిన లెబనాన్ దళాలను మోహరించడం ఈ ఒప్పందంలో ఉంది. అయితే, దీని గురించిన దోళనలు ఉన్నాయి. లెబనాన్ సైన్యం కాల్పుల విరమణను ఎలా అమలు చేస్తుంది? అవసరమైతే అది హిజ్బొల్లాతో తలపడుతుందా? ఇది బలమైన మత, జాతి సమూహ విభేదాలున్న దేశంలో పరిస్థితిని మరింత దిగజార్చవచ్చు. అయితే, ఒప్పందం ప్రకారం బాధ్యత లను పూర్తిగా నెరవేర్చడానికి తమ వద్ద తగినంత నిధులు, సిబ్బంది, సామగ్రి లేవని లెబనాన్ సైన్యం పేర్కొంది. కాగా, మిత్రదేశాల సహాయంతో లెబనాన్‌కు ఈ సమస్య నుంచి సడలింపు దొరకవచ్చు. హిజ్బొల్లా ప్రస్తుతం బలహీనంగా ఉందని చాలామంది పాశ్చాత్య అధికారులు అంటున్నారు. మొత్తం దేశంపై నియంత్రణను తిరిగి పొందడానికి లెబనాన్ ప్రభుత్వానికి ఇది అవకాశంగా మారింది.ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం 1701పై ఆధారపడి ఈ ఒప్పందం జరిగింది. ఇదే 2006లో ఇజ్రాయెల్, హిజ్బొల్లా మధ్యన జరిగిన యుద్ధాన్ని ముగించింది. 1701 తీర్మానం ప్రకారం, లిటాని నదికి దక్షిణాన ఉన్న ప్రాంతంలో లెబనీస్ ప్రభుత్వ, యూఎన్ శాంతి పరిరక్షక దళం (యునిఫిల్) మినహా ఎలాంటి సాయుధ గ్రూపులు లేదా ఆయుధాలు ఉండకూడదు. అయితే, ఈ నిబంధనలను ఉల్లంఘించారని ఇరువర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. హిజ్బొల్లా అక్కడ మౌలిక సదుపాయాలను నిర్మించిందని ఇజ్రాయెల్ వాదిస్తోంది. తమ భూభాగంపై సైనిక విమానాలు తీసుకొచ్చి ఇజ్రాయెల్ తీర్మానాన్ని ఉల్లంఘించిందని లెబనాన్ అంటోంది. ఈసారి ఉల్లంఘనలను గుర్తించడానికి యునిఫిల్, లెబనాన్, ఇజ్రాయెల్‌లతో కూడిన ప్రస్తుత పర్యవేక్షణ వ్యవస్థలో అమెరికా, ఫ్రాన్స్ చేరుతాయని యుఎస్ అధికారి ఒకరు తెలిపారు. మరోవైపు, అమెరికా మద్దతుతో లెబనాన్‌లో స్వేచ్ఛగా సైనిక చర్య తీసుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని ప్రధాని నెతన్యాహు అన్నారు. ' ఒప్పందాన్ని ఉల్లంఘించి, హిజ్బొల్లా ఆయుధాలు పొందడానికి ప్రయత్నిస్తే.. మేం దాడి చేస్తాం. సరిహద్దుల్లో ఉగ్రవాద కేంద్రాలను పునర్నిర్మిస్తే దాడులు చేస్తాం. అది రాకెట్లను ప్రయోగించినా, సొరంగాలు తవ్వినా, రాకెట్లతో ట్రక్కులను తీసుకువచ్చినా దాడి చేస్తాం' అని ఆయన అన్నారు. 'హిజ్బొల్లా లేదా మరెవరైనా ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇజ్రాయెల్‌కు ముప్పు తలబెడితే అంతర్జాతీయ చట్టం ప్రకారం తనను తాను రక్షించుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉంది' అని బైడెన్ మీడియా ప్రతినిధులతో చెప్పారు. ఈ ఒప్పందం లెబనాన్ సార్వభౌమత్వాన్ని గౌరవిస్తుందని కూడా ఆయన అన్నారు.

# సూర్యాపేటలో బీఆర్ఎస్‌వీ గురుకుల బాట



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు రాష్ట్ర విభాగం ఇచ్చిన పిలుపు మేరకు సూర్యాపేటలో బీఆర్ఎస్‌వీ నాయకులు గురుకుల బాట కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రభుత్వ హాస్టళ్లను విద్యార్థి సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిగ వెంకటేశ్ గౌడ్ ఆధ్వర్యంలో పలు హాస్టళ్ళను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర విద్యార్థి నాయకులు రాపోలు నవీన్ కుమార్, నెమ్మది శ్రవణ్ కుమార్, బానోత్ సురేష్ నాయక్, గుండాల సందీప్, పల్లెపంగు నాగరాజు, రామావత్ అశోక్ నాయక్, వడ్డేపల్లి సందీప్, వేల్పుకొండ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అనంతపురంలో ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు ప్రభుత్వ వైద్యులు మృతి





అమరావతి : ఏపీలో అనంతపురం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రభుత్వ వైద్యులు దుర్మరణం చెందారు. బళ్లారికి చెందిన ఓపిడీ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ముగ్గురు వైద్యులు హంకాంగ్ పర్యటనకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదంలో కన్నుమూశారు. బళ్లారికి విమానాశ్రయానికి చేరుకుని నలుగురు కారులో బయలు దేరారు.

ఆదివారం ఉదయం అనంతపురం విడపనకల్లు వద్ద అతివేగంగా వచ్చి చెట్టును ఢీకొనడంతో ముగ్గురు వైద్యులు గోవిందరాజులు, యోగేశ్ , ప్రైవేట్ ఆసుపత్రి మేనేజర్ వెంకట్‌నాయుడు అక్కడికక్కడే మృతి చెందగా అమరగౌడ్ అనే తీవ్రగాయాలయ్యాయి. అతడిని బళ్లారి ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందజేస్తున్నారు. . చెట్టున ఢీకొన్న కారు నుజ్జునుజ్జయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# స్వచ్ఛత మనకు అందని మానిపండు

'స్వచ్ఛ'భారతంలో స్వచ్ఛత ఒక దేవతావస్త్రం. మనం పీల్చే గాలి, మనం తాగే నీరు, మనం తినే తిండి-ఎందులో చూసినా స్వచ్ఛత మనకు అందని మానిపండు. ప్రపంచ జల నాణ్యత సూచిలో మన దేశం అట్టడుగు నుంచి మూడోస్థానంలో ఉంది. మొత్తం 122 దేశాలతో కూడిన ఈ జాబితాలోమనది 120వ స్థానం. మన దేశంలో మనం తాగే నీటి తీరుతెన్నులపై ఒక సంక్షిప్త పరిశీలన. మన దేశంలో తాగేనీటి కోసం జనాలు అనుదినం అగచాట్లు పడుతూనే ఉన్నారు. నానా తంటాలు పడి తెచ్చుకున్న నీటితో దాహం తీర్చుకుంటే, ఆ నీటిలో స్వచ్ఛత కొరవడి వ్యాధుల బారిన పడుతున్నారు. మన దేశంలోని ఉపరితల, భూగర్భ జలాల్లో దాదాపు 70 శాతం కలుషిత జలాలే. దేశంలోనే అతిపెద్దదైన గంగానది సహా దేశంలోని నదుల నీటిలో విషపూరితమైన ఆర్సెనిక్, కాడ్మియం, క్రోమియం, రాగి, ఇనుము, పాదరసం, సీసం వంటి భారలోహాలు చేరుతున్నట్లు పలు అధ్యయనాల్లో తేలింది. దేశంలోని చాలాచోట్ల నీటి లభ్యతే అంతంత మాత్రం. ఇక దొరికే నీటిలో చాలా వరకు కలుషితమైనదే కావడంతో నీటికాలుష్యం ప్రజారోగ్య సమస్యగా మారింది. దేశంలోని నదీపరివాహక ప్రాంతాల్లోని గ్రామీణ ప్రజలు చాలామంది నదుల నుంచి సేకరించిన నీటిని నేరుగా తాగునీటిగా ఉపయోగించే పరిస్థితులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది.





**ప్రమాదకర స్థాయిలో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ :** దేశంలోని నగరాలు, పట్టణాల వద్ద ప్రవహించే నదీ ప్రాంతాల్లో నీటిలో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ) అతి ఎక్కువగా, అత్యంత ప్రమాదకరమైన స్థాయిలో ఉన్నట్లు నీటి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాలు సేకరించి, పరీక్షించిన శాంపుల్స్ ద్వారా వెల్లడైంది. నీటిలో ప్రతి లీటరుకు బీఓడీ 1%--%2 మిల్లీగ్రాముల వరకు ఉంటే ఆ నీరు పూర్తిగా స్వచ్ఛమైనది. బీఓడీ ప్రతి లీటరుకు 3%--%8 మిల్లీగ్రాముల మధ్య ఉంటే, నీరు ఒక మోస్తరు స్వచ్ఛమైనది. బీఓడీ లీటరుకు 8%--%20 మిల్లీగ్రాముల వరకు ఉంటే, ఆ నీరు ప్రమాదానికి చేరువలో ఉన్నట్లు లెక్క. నీటిలో బీఓడీ ప్రతి లీటరుకు 20 మిల్లీగ్రాముల కంటే ఎక్కువగా ఉన్నట్లయితే, ఆ నీరు పూర్తిగా ప్రమాదకరమైన స్థాయిలో ఉన్నట్లే లెక్క. బీఓడీ మోతాదు పెరిగే కొద్ది ఆ నీటిలో జలచరాల మనుగడ సాగించడం కష్టమవుతుంది. నీటిలో బీఓడీ పెరుగుదల కారణంగా జలచరాలకు ముప్పు వాటిల్లుతోందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే, కొన్ని ప్రధానమైన నదుల్లో కోలిఫార్మ్ బ్యాక్టీరియా ప్రమాదకర స్థాయిలో ఉంటోంది. గంగ, యమున, గోమతి, ఘాఘరా, చంబల్, మహి, వార్ధా, గోదావరి జలాల్లో కోలిఫార్మ్ బ్యాక్టీరియా ప్రమాదకరమైన స్థాయిలో ఉన్నట్లు నీటి నాణ్యత కేంద్రాల పరిశీలనలో తేలింది.

**మన నదుల పరిస్థితి :** కేంద్ర జల మండలి పరిశోధనలో తేలిన అంశాల ప్రకారం దేశంలోని ప్రధానమైన నదులేవీ కాలుష్యానికి అతీతంగా లేవు. గంగానది జలాల్లో ఐదు ప్రమాదకరమైన భార లోహాలు- క్రోమియం, రాగి, నికెల్, సీసం, ఇనుము పరిమితికి మించి చాలా రెట్లు ఎక్కువగా ఉన్నాయి. గంగానది సహా దేశంలోని 42 నదులలోని నీరు అత్యంత తీవ్రస్థాయిలో కలుషితమైనట్లు కేంద్ర జలమండలి నిర్వహించిన పరిశోధనలో తేలింది. ఈ నదుల నీటిలో పరిమితికి మించి ప్రమాదకరమైన భార లోహాలు, ఇతర రసాయనాలు ఉన్నాయని ఈ పరిశోధనలో వెల్లడైంది. యమున, గోమతి, అర్కావతి, ఓర్సంగ్, సబర్మతి, సరయు, రాప్తి, వైతరణి, గోదావరి, కావేరి, పెన్నా, నర్మద, తీస్తా, మహానది, బ్రహ్మపుత్ర, సువర్ణరేఖ, నాగావళి వంటి నదులలో సైతం ఈ భార లోహాలు పరిమితికి మించి ప్రమాదకర స్థాయిలో ఉన్నాయి. కాలుష్య కాసారాలుగా మారిన ఈ నదుల పరివాహక ప్రాంతాల్లోని సాగుభూముల్లోకి, వాటి ద్వారా తిండిగింజల్లోకి, ఇతర ఆహార పంటల్లోకి ఈ విషపదార్థాలు ప్రమాదకరమైన స్థాయిలో చేరుతున్నాయి. కలుషితమైన నీటి కారణంగా మనం తినే తిండి కూడా కలుషితమవుతోంది. గనులు, తోలు, రబ్బర్, వ్యవసాయంలో మోతాదుకు మించి వాడే పురుగుమందులు, ఎరువులు, నదుల్లో పడవేసే ఘన వ్యర్థాలు వంటివన్నీ ఈ కాలుష్యానికి కారణమవుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నిర్వహించిన అధ్యయనం ప్రకారం%--% దేశవ్యాప్తంగా 3,119 పట్టణాలు, నగరాలలో, కేవలం 209 పట్టణాలు, నగరాలలో వ్యర్థజాలాలను శుద్ధి చేసే సౌకర్యాలు పాక్షికంగా ఉన్నాయి. కేవలం 8 నగరాల్లో మాత్రమే వ్యర్థజలాలను శుద్ధి చేసే సౌకర్యాలు పూర్తి స్థాయిలో ఉన్నాయి. దేశంలోని 114 నగరాలు శుద్ధి చేయని వ్యర్థజలాలను, సగం కాలిన శవాలను నేరుగా గంగా నదిలోకి వదిలేస్తున్నాయి. దేశంలోని ప్రధాన నగరాల నుంచి ప్రతిరోజూ 3835.4 కోట్ల లీటర్ల మురుగు నీరు విడుదలవుతోంది. ఈ నగరాల మురుగునీటి శుద్ధి సామర్థ్యం రోజుకు 1178.6 కోట్ల లీటర్లు మాత్రమే. మిగిలిన మురుగునీరంతా ఆయా నగరాలకు సమీపంలోని నదులకు, ఇతర జలాశయాలకు నేరుగా చేరుకుంటోంది. కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి దేశంలోని 28 రాష్ట్రాలు, 6 కేంద్ర పాలిత ప్రాంతాల్లో నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడానికి 1429 కేంద్రాలను నెలకొల్పాయి. ఈ కేంద్రాలు దేశంలోని 293 నదులు, 94 సరస్సులు, 94 జలాశయాలు, 23 కాలువలు, 18 డ్రైనేజీలు, 411 బావులలోని నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నా, మన దేశం నీటి నాణ్యత విషయంలో ఇంకా అట్టడుగు స్థానాల్లోనే కొనసాగుతుండటం గమనార్హం.



**నీటి కాలుష్యంతో తీవ్ర నష్టం :** దేశంలో పట్టణీకరణ పెరుగుతున్న కొద్ది నీటి వనరుల కాలుష్యం పెరుగుతూ వస్తోంది. ప్రతిరోజూ దాదాపు నాలుగు కోట్ల లీటర్ల వ్యర్థజలాలు నదుల్లోకి, ఇతర జలాశయాల్లోకి చేరుతున్నాయి. మన దేశంలోని నదుల ఎగువ ప్రాంతాల్లో కాలుష్యం పెరిగే కొద్ది దిగువ ప్రాంతాలకు ఆర్థిక నష్టం పెరుగుతూ వస్తోందని, ఫలితంగా ఈ ప్రాంతాల్లోని స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు మూడింట ఒకవంతు పడిపోతోందని ప్రపంచ బ్యాంకు ఒక అధ్యయనంలో తెలిపింది. నదుల దిగువ ప్రాంతాల్లో కాలుష్యం కారణంగా వ్యవసాయ దిగుబడులకు 16 శాతం వరకు, వ్యవసాయ ఆదాయానికి 9 శాతం వరకు నష్టం వాటిల్లుతోందని ఈ అధ్యయనం వెల్లడించింది. దీని ప్రకారం నీటి కాలుష్యం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థకు ఏటా రూ.61 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లుతోంది. అంతేకాదు, నీటి కాలుష్యం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలతో దేశంలో ఏటా సుమారు నాలుగు లక్షల వరకు అకాల మరణాలు సంభవిస్తున్నాయి. ఈ మరణాలు 'కరోనా' మహమ్మారి కారణంగా సంభవించిన మరణాల కంటే చాలా ఎక్కువ. 'కలుషితమైన నీటిని వ్యవసాయానికి ఉపయోగిస్తుండటం వల్ల రైతులు నానా సమస్యలను ఎదుర్కొంటున్నారు. కలుషితమైన నీటి వల్ల మట్టి, అందులో పండే పంటలు కూడా కలుషితమవుతున్నాయి. ఇది చాలా ఆందోళనకరమైన పరిణామం' అని సెంటర్ ఫర్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్' (సీఈఈడబ్ల్యూ) శాస్త్రవేత్త సుమిత్‌కుమార్ గౌతమ్ అభిప్రాయపడుతున్నారు.

నీటిలో చేరిన రసాయనాల కారణంగా ఏర్పడుతున్న కాలుష్యం ఒక ఎత్తయితే, నదీతీరాలు ఉన్న ప్రాంతాల్లో పరిశుభ్రత లోపం, జంతు కళేబరాలను, పాడైన ఆహార వ్యర్థాలను యథేచ్ఛగా నదుల్లో పడేస్తూ ఉండటం తదితర కారణాల వల్ల నదుల నుంచి సరఫరా అయ్యే తాగునీటిలో సూక్ష్మజీవుల ఉధృతి పెరుగుతోంది. రక్షిత మంచినీటి సరఫరా లేని ప్రాంతాల్లోని వారు అపరిశుభ్రమైన పరిసరాల్లోని నదులు, చెరువులు, బావుల నీటినే తాగడానికి ఉపయోగిస్తుండటం వల్ల రకరకాల వ్యాధులకు గురవుతున్నారు. నీటి నుంచి వ్యాపించే సూక్ష్మజీవుల వల్ల తలెత్తే డయేరియా, కలరా, డీసెంట్రీ, అమీబియాసిస్, ఫైలేరియా, హెపటైటిస్, టైఫాయిడ్ వంటి వ్యాధులతో దేశంలో ఏటా 3.77 కోట్ల మంది బాధపడుతున్నారు. ఈ వ్యాధుల కారణంగా ఏటా దాదాపు 15 లక్షల మంది చిన్నారులు అకాల మరణాల పాలవుతున్నారు.

**ఫ్లోరైడ్ ప్రభావం మరో సమస్య :** ఉపరితల జలాలు భార లోహాలు, సూక్ష్మజీవుల కారణంగా కలుషితమవుతుంటే, దేశంలోని పలు చోట్ల భూగర్భ జలాలు మోతాదుకు మించిన ఫ్లోరైడ్‌తో ప్రజారోగ్యాన్ని కుదేలు చేస్తున్నాయి. దేశంలోని 19 రాష్ట్రాల్లోని 230 జిల్లాల్లోని భూగర్భ జలాల్లో ఫ్లోరిన్ మోతాదుకు మించి ఉన్నట్లు వివిధ అధ్యయనాల్లో తేలింది. ఈ ప్రాంతాల్లో దాదాపు 2.50 కోట్ల మందికి పైగా ప్రజలు మోతాదుకు మించిన ఫ్లోరైడ్ నిండిన నీటిని తాగడం వల్ల ఫ్లోరోసిస్ ముప్పు అంచున మనుగడ సాగిస్తున్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) నీటిలో ఫ్లోరిన్ పరిమాణం ప్రతి లీటరుకు 1.0%--%1.5 మిల్లీగ్రాముల వరకు ఉండాలి. ఈ పరిమాణం కంటే తగ్గినా, పెరిగినా ఇబ్బందేనని తొలిసారిగా 1938లో అమెరికాలోని మెలన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌కు చెందిన శాస్త్రవేత్త గెరాల్డ్ కాక్స్ గుర్తించారు. నీటిలో తగిన మోతాదులో ఉండే ఫ్లోరిన్ దంతక్షయాన్ని నివారిస్తుంది. మోతాదుకు మించితే ఫ్లోరోసిస్ జబ్బుకు దారితీస్తుంది. ఈ జబ్బు బారిన పడిన వారిలో దంతాలపై మచ్చలు, ఎముకలు వంకర్లు పోవడం వంటి లక్షణాలు ఏర్పడతాయి. వ్యాధి తీవ్రత పెరిగే కొద్ది మామూలుగా నడవడానికి కూడా ఇబ్బంది కలుగుతుంది. నీటిలో ఫ్లోరిన్ మోతాదు ఎక్కువగా ఉంటే ఫ్లోరోసిస్‌తో పాటు ఆస్టియోపోరాసిస్, ఆర్థరైటిస్, ఎముకలు పెళుసుబారడం, కేన్సర్, మెదడు లోపాలు, అల్జీమర్స్ వ్యాధి, థైరాయిడ్ సమస్యలు కూడా తలెత్తుతాయి. దేశంలో అత్యధికంగా రాజస్థాన్‌లోని భూగర్భ జలాల్లో ఫ్లోరిన్ కాలుష్యం అత్యధికంగా ఉంటోంది. బీహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, జార?ండ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లోని భూగర్భ జలాల్లో ఫ్లోరిన్ కాలుష్యం మోతాదుకు మించి ఉంటోంది. ఫ్లోరిన్ కాలుష్యాన్ని నివారించడానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు కొన్ని ప్రాంతాల్లో సత్ఫలితాలను ఇస్తున్నాయి. తెలంగాణలోని నల్లగొండ జిల్లాలో ఇదివరకు ఫ్లోరోసిస్ తీవ్రత ఎక్కువగా ఉండేది. గడచిన ఐదేళ్లలో ఈ ప్రాంతంలో కొత్త ఫ్లోరోసిస్ కేసులేవీ నమోదు కాలేదు. ఇటుకల బట్టీలు, అల్యూమినియం, ఉక్కు కర్మాగారాలు, ఫాస్ఫేట్ ఎరువుల కర్మాగారాలకు చెందిన వ్యర్థాలను భూమిలో లోతైన గోతులను తవ్వి, వాటిలో పారవేస్తుంటాయి. వీటి వల్ల పరిసరాల్లోని భూగర్భ జలాల్లో రసాయనిక కాలుష్యం ఏర్పడుతోంది. కొన్ని రకాల ఫాస్ఫేట్ ఎరువుల కర్మాగారాల వ్యర్థాలు భూగర్భంలో చేరుతుండటం వల్ల భూగర్భ జలాల్లో ఫ్లోరిన్ పరిమాణం మోతాదుకు మించి చేరుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 70 శాతం జనాభాకు మంచినీరు కొళాయిల ద్వారా సరఫరా అవుతుంటే, గ్రామీణ ప్రాంతాల్లో 18.4 శాతం జనాభాకు మాత్రమే కొళాయిల ద్వారా మంచినీటి సరఫరా జరుగుతోంది. కొళాయిల ద్వారా సరఫరా అవుతున్న మంచినీటి నాణ్యతపై కూడా పలుచోట్ల ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. చిట్లిపోయిన పైపుల్లోకి మురుగునీరు చేరడంతో కొన్ని చోట్ల కొళాయిల ద్వారా మురుగునీరు సరఫరా అయ్యే పరిస్థితులు ఉన్నాయి. దేశవ్యాప్తంగా మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడం, మంచినీటి పైపుల్లోకి మురుగునీరు చేరకుండా డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచడం, నదులలోకి ఘన వ్యర్థాలు చేరకుండా అరికట్టడం వంటి చర్యలను కట్టుదిట్టంగా చేపడితే తప్ప మన దేశంలోని నీటి నాణ్యత మెరుగుపడే పరిస్థితులు కనిపించడం లేదు.





# ఇంటర్నెట్ వరం కావాలి, శాపం కాదు..!

మానవ పరిణామ క్రమంలో పాతరాతియుగం నుంచి నేటి నవ్య నానో డిజిటల్ యుగం వరకు జరిగిన శాస్త్రసాంకేతిక డిజిటల్ విప్లవంతో మానవాళి జీవనశైలిలో భారీ మార్పులు చోటు చేసుకోవడంతో ప్రపంచమే కుగ్రామమై పోయింది. ఈ-మెయిల్, యూట్యూబ్, వాట్స్ యాప్, ఫేస్‌బుక్, గూగుల్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్, మెసెంజర్ లాంటి సామాజిక మాద్యమాలు మన నిత్యజీవితంలో భాగం అయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా కంప్యూటర్ల వ్యవస్థను రిమోట్ కంట్రోల్ ద్వారా అనుసంధానం చేస్తూ సమాచారాన్ని ఒకరి నుండి మరొకరికి చేర్చడాన్ని అంతర్జాలంగా చెప్పవచ్చు. ఇంటర్నెట్ లేదా ఇంటర్‌కనెక్టెడ్ నెట్‌వర్క్ వాడకుండా గంట గడవడం అసాధ్యంగా తోస్తున్నది. అరచేతిలో వైకుంఠం చూపే స్మార్ట్ ఫోన్ మానవ శరీరంలో ఒక శాశ్విత అంగమై కూర్చుంది. నేటి 'వరల్డ్ వైడ్ వెబ్ (డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ)'ను 1989లో 'టిమ్ బెర్నర్స్ – లీ'లు కనుగొన్నారు. వరల్డ్ వైడ్ వెబ్ మరియు అంతర్జాల (ఇంటర్నెట్) ప్రక్రియల ఆవిష్కరణల తరువాత గత 30 సంవత్సరాలుగా గ్రామీణం నుండి మహానగరాల వరకు, పల్లె గల్లీ నిరక్షరాస్యుడి నుంచి పట్టణ పట్టభద్ర మేధావి వరకు సాంకేతిక విప్లవ ఫలాలు అందడం అమిత ఆనందాన్ని కలిగిస్తున్నది. 29 అక్టోబర్ 1969 రోజున ప్రప్రథమంగా కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో 'చార్లీ క్లైన్ మరియు లియొనార్డ్ క్లీన్‌రాఖ్'ల చొరవతో తొలి ప్రయత్నంగా 'యల్' అండ్ 'ఓ' అనే 'లాగిన్' పదాన్ని ఎలక్ట్రానిక్ ఇంటర్నెట్ మెసేజ్ ద్వారా పంపించడం విజయవంతంగా జరిగింది. అంతర్జాల అద్భుత ఆవిష్కరణతో ప్రపంచవ్యాప్తంగా పలు ఆధునిక డిజిటల్ రంగ అనువర్తనాలు వ్యక్తి జీవితంలో పెను మార్పులకు దారి తీస్తున్నది. అంతర్జాల డిజిటల్ విప్లవ ప్రాధాన్యతను గమనించిన సాంకేతిక సమాజం 2005 నుండి ప్రతియేటా 29 అక్టోబర్ రోజున "అంతర్జాతీయ అంతర్జాల దినం (ఇంటర్నేషనల్ ఇంటర్నెట్ డే)" పాటించడం జరుగుతున్నది. ప్రారంభంలో ఇంటర్నెట్‌ను 'ఆర్పనెట్'గా పిలిచేవారు. ప్రస్తుత రూపపు 'ఇంటర్నెట్'గా పిలువబడుతూ అసాధారణ విస్తరణతో 'ఇన్ఫర్‌మేషన్ సూపర్‌హైవే' స్థాయి రావడానికి అనేక మంది శాస్త్రజ్ఞులు, ప్రోగ్రామర్లు మరియు సాఫ్ట్ వేర్ ఇంజనీర్ల కృషి దాగి ఉందని గమనించాలి. ఇంటర్నెట్‌లో 'సర్ఫింగ్' అనే పదాన్ని 1992లో 'జీన్ ఆర్మర్ పోల్లీ (నెట్ మమ్ అని కూడా పిలుస్తారు)' ప్రవేశపట్టడం జరిగింది. గూగుల్ సహాయంతో ఒక ప్రశ్నకు కంప్యూటర్ 0.2 సెకన్‌లలో సమాధానం ఇస్తున్నది. అంతర్జాల సహాయంతో ఫేస్‌బుక్ సామాజిక మాద్యమాన్ని 2004లో 'మార్క్ జుకెర్‌బర్గ్' కనిపెట్టడం జరిగింది. 1971లో 'రే టాంలిన్సన్' ప్రప్రథమ ఈ-మెయిల్ పంపడంతో ఆరంభమై, నేడు 3.6 బిలియన్ల ఈ-మెయిల్ అకౌంట్లతో రోజుకు 294 బిలియన్ల ఇంటర్నెట్ ఈ-మెయిల్స్ ప్రపంచవ్యాప్తంగా పంపించే స్థాయికి చేరింది. 1990లో మైక్రోసాఫ్ట్ విండోస్, 1994లో యాహూ, 1995లో ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్, 1998లో గూగుల్, 2006లో ట్విట్టర్‌లు లాంటి అనేక యాప్‌లు వాడుకలోకి వచ్చాయి. 23 ఏప్రిల్ 2005న తొలి 'యూ ట్యూబ్' వీడియోను సాంకేతిక నిపుణుడు 'సాన్ డీగో జూ' అప్‌లోడ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ వాడడానికి 50 మిలియన్ హార్స్ పవర్ విద్యుత్తు అవసరం అవుతున్నది. ప్రస్తుతం గూగుల్‌ను 'కింగ్ ఆఫ్ ఆల్ ఇంటర్నెట్స్'గా పిలుస్తున్నారు. గూగుల్ పదానికి విస్తరణగా 'గ్లోబల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఓరియంటెడ్ గ్రూప్ లాంగ్వేజ్ ఆఫ్ ఎర్త్'ను వాడుతున్నారు. స్మార్ట్ ఫోన్లు, ట్యాబులు, కంప్యూటర్లు, లాప్‌లాప్‌లు, కెమెరాలు, టీవీలు మరియు ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు వైఫై సహాయంతో ఇంటర్నెట్ సౌకర్యాలను పొందడం వరంగా మారింది. నేడు విశ్వవ్యాప్తంగా ఒక బిలియన్ వెబ్‌సైట్లు వాడుకలో ఉన్నాయి. అంతర్జాల ఆధార కంపెనీలు మైక్రోసాఫ్ట్ 75 బిలియన్లు, ఆపిల్ 45 బిలియన్లు, ఫేస్‌బుక్ 44 బిలియన్లు, గూగుల్ 35 బిలియన్ల అమెరికన్ డాలర్ల బడా వ్యాపారం చేస్తున్నాయి. అంతర్జాలంతో ఎలక్ట్రానిక్ మెయిల్స్, పరిశోధనలు, డౌన్‌లోడ్ ఫైల్స్, ఆన్‌లైన్ చర్చలు, గేమ్స్, ఈ-విద్య, స్నేహం, ప్రింట్ మీడియా, సామాజిక మాద్యమాలు, విజ్ఞాన వినిమయం, చలన చిత్రాలు, ఫైల్ ట్రాన్స్ఫర్, వర్చువల్ సమావేశాలు, ఈ-లైబ్రరీ, కృత్రిమ మేధ, ఆర్థిక మరియు బ్యాంకింగ్ కార్యకలాపాలు మొదలగు అనేక రంగాలలో విస్తృత ఉపయోగాలు ఉన్నాయి. మానవాళికి అంతర్జాలం గొప్ప వరంగా మారినప్పటికీ, మరో కోణంలో శాపంగా పరిణమించడం విచారకరం. పిల్లలకు కరోనా విధించిన ఆన్‌లైన్ ఈ-తరగతులతో ఉపయోగపడుతున్న స్మార్ట్ ఫోన్‌లు మరో వైపు అశ్లీల అభ్యంతరకర అంతర్జాల మాద్యమాలు అరచేతిలో అందుబాటులోకి రావడం వారి భవిష్యత్తుకే ప్రమాదకరంగా మారుతోంది. స్మార్ట్ ఫోన్ వినియోగం దుర్వాసనంగా మారింది. నీలికాంతితో కంటి చూపు దెబ్బతినడం, సమయం వ్యర్థం చేయడం, నేర ప్రవృత్తికి బీజాలు పడడం, ఓపిక నశించడం, అనారోగ్య సమస్యలు, ఏకాగ్రత లోపించడం, సమాజానికి దూరంగా ఒంటరితనం కోరుకోవడం, దురలవాట్లను ప్రేరేపించడం, అశ్లీల సైట్లకు అలవాటు పడడం, పనిలో శ్రద్ధ తగ్గడం, స్థూలకాయ రుగ్మతలు, అనవసర వస్తువులు ఆన్‌లైన్‌లో కొనడం, నిద్రలేమి, సైబర్ నేరాలు మొదలగు విష ప్రభావాలను సమాజం చవిచూడవలసి వస్తున్నది. అంతర్జాల నేరాలను కట్టడి చేయడానికి సైబర్ నేరాల అదుపుకు సంబంధించిన కొత్త చట్టాలు కూడా అందుబాటుకి రావడం చూస్తున్నాం. ఇంటర్నెట్‌ను సురక్షితంగా మానవాళి అభివృద్ధికి వాడుతూ, దుష్ప్రభావాలకు దూరంగా ఉంటూ, సుఖ సంపదలతో వసుధైక కుటుంబాన్ని నిర్మించుకుందాం. అంతర్జాలాన్ని ఆత్మసౌందర్య వికాసానికి వినియోగించుకుందాం. 'ఇంటర్నెట్ ఈజ్ ఫర్ బెట్టర్‌మెంట్' నినాదాన్ని ప్రచారం చేద్దాం.

# పిల్లలు గంట.. పెద్దలు 45 నిమిషాలు



**హైదరాబాద్:** ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం చేయాలని అందరికీ తెలుసు. కానీ ఏ వయసు వారు ఎంతసేపు, ఎలాంటి వ్యాయామాలు చేయాలి? అనే అంశాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తాజాగా స్పష్టత ఇచ్చింది. ఐదేళ్ల పిల్లలు మొదలు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు, గర్భిణులను ఐదు కేటగిరీలుగా విభజించి ఎవరెంతసేపు ఎక్సర్‌సైజులు చేయాలో సూచించింది. బీపీ, షుగర్, ఎసిడిటీ, స్థూలకాయం, కేన్సర్, గుండె జబ్బులు తదితర జీవనశైలి వ్యాధులతో సతమతమవుతున్న ప్రజలు తిరిగి ఆరోగ్యకర జీవనం సాగించేందుకు వీలుగా శారీరక శ్రమపై తొలిసారి శాస్త్రీయ మార్గదర్శకాలతో నివేదిక విడుదల చేసింది.

**5-17 ఏళ్ల వయసువారు...** ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్క ప్రకారం ఐదేళ్ల నుంచి 17 ఏళ్లలోపు ఉన్న పిల్లలు, ప్రతిరోజూ కనీసం గంటపాటు శక్తివంతమైన వ్యాయామాలు చేయాలి. ఎక్కువగా పరిగెత్తడం, జాగింగ్ లేదా ఏరోబిక్ వ్యాయామాలు చేయాలి. వారంలో మూడురోజులు కండరాలు, ఎముకలను బలోపేతం చేసే ఎక్సర్‌సైజులు చేయాలి. ఆటలు ఆడాలి.

**18-64 ఏళ్ల వయసువారు...** ఈ విభాగంలోని వారు ప్రతివారం కనీసం రెండున్నర గంటల నుంచి ఐదు గంటల వరకు (రోజుకు గరిష్టంగా సుమారు 45 నిమిషాలు) తేలికపాటి నుంచి కఠిన ఎక్సర్‌సైజులు చేయాలి. వారానికి కనీసం 95 నిమిషాల నుంచి రెండున్నర గంటల వరకు కఠినమైన వ్యాయామాలు చేయడం వల్ల గుండె జబ్బులు, రక్తపోటు, కేన్సర్, టైప్-2 డయాబెటీస్ నుంచి బయటపడొచ్చు. శారీరక ఆరోగ్యం, మానసిక శ్రేయస్సు కోసం వ్యాయామం అవసరం.

**65 ఏళ్లు పైబడినవారు...** వృద్ధులు సైతం 18-64 ఏళ్ల వయసు కేటగిరీ వారు చేసే వ్యాయామాలన్నీ చేయవచ్చు. వాటితోపాటు వారు వారానికి కనీసం మూడు రోజులు శరీర బ్యాలెన్స్‌కు దోహదపడే ఎక్సర్‌సైజులు చేయడం మంచిది. వృద్ధులు తూలి కిందపడకుండా ఉండేందుకు ఈ తరహా వ్యాయామాలు ఉపయోగపడతాయి.

**గర్భిణులు...** గర్భిణులు లేదా బాలింతలు ఎలాంటి సమస్యలు లేకపోతే డాక్టర్ల సూచన మేరకు ప్రతివారం కనీసం రెండున్నర గంటల వరకు పరిమితమైన ఏరోబిక్స్ చేయాలి. అయితే వ్యాయామ సమయంలో నిర్ణీత పరిమాణంలో మంచినీరు తప్పక తాగాలి. కఠినమైన వ్యాయామాలు చేయరాదు.

**దీర్ఘకాలిక అనారోగ్యాలున్నవారు...** దీర్ఘకాలిక జీవనశైలి వ్యాధులున్న వారు వారానికి కనీసం గంటన్నర నుంచి ఐదు గంటలపాటు ఏరోబిక్స్ చేయాలి. లేదా వారానికి కనీసం 75 నిమిషాల నుంచి రెండున్నర గంటలపాటు కఠినమైన, శక్తివంతమైన ఏరోబిక్స్ చేయాలి. అలాగే వారానికి కొన్నిసార్లు, తమ సామర్థ్యాలను పెంచుకోవడానికి బ్యాలెన్స్ వ్యాయామాలు చేయాలి. **శారీరక శ్రమను ప్రోత్సహించాలి :** డబ్ల్యూహెచ్‌వో నివేదికలోని మార్గదర్శకాలు అత్యంత శాస్త్రీయమైనవి. అందువల్ల శారీరక శ్రమ చేసేందుకు పిల్లలను ప్రోత్సహించాలి. తద్వారా వారిలో గుండె, ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. ఎముకలు బలపడతాయి మానసిక ఉల్లాసం లభిస్తుంది. శారీరక శ్రమ చేసే గర్భిణుల్లో బీపీ సమస్య తలెత్తదు. ముందస్తు కాన్పుల సమస్య తగ్గుతుంది. **డబ్ల్యూహెచ్‌వో పేర్కొన్న అంశాలివి :** రోజుకు 10-12 గంటలు స్థిరంగా కూర్చునే వారిలో ముందస్తు మరణాలు సంభవించే అవకాశం మిగతావారికంటే 1.5 రెట్లు ఎక్కువ. శారీరక శ్రమ ఎక్కువగా చేసే వారిలో కిడ్నీ సమస్యలు, కడుపులో మంట, కేన్సర్ వంటివి 10 నుంచి 20 శాతం వరకు తగ్గుతాయి. అధిక బరువు సమస్య తలెత్తదు. షుగర్ వ్యాధిగ్రస్తులకు గుండెజబ్బు మరణాలు 40 శాతం తగ్గుతాయి. 27.5 శాతం పెద్దలు, 81 శాతం యుక్త వయస్కులు శారీరక శ్రమ చేయడంలేదు.

# పోర్టబుల్ గ్రిల్.. చికెన్, మటన్




ఒక ప్రత్యేకమైన సందర్భాన్ని మరింత ప్రత్యేకంగా నిలిపేవి నోరూరించే పసందైన రుచులే. స్నేహితులతో లేదా కుటుంబ సభ్యులతో లాంగ్ డ్రైవ్‌కి వెళ్లినప్పుడు.. అలాంటి రుచులను అందిస్తూ ఆ సందర్భాన్ని అమృత జ్ఞాపకంగా మిగిల్చేదే.. ఈ లగేజ్ స్టయిల్ పోర్టబుల్ గ్రిల్. దీన్ని మన లగేజ్‌తో పాటు వెంట తీసుకెళ్తే చాలు, రుచుల పంట పండినట్లే. ఇందులో ఎలాంటి వంటైనా నిమిషాల్లో రెడీ అవుతుంది. చికెన్, మటన్ వంటి వాటినీ రకరకాలుగా గ్రిల్ చేసుకోవచ్చు. నచ్చిన విధంగా టోస్ట్ చేసుకోవచ్చు. చిత్రంలో కనిపిస్తున్న ఈ మెషిన్‌ని ఓపెన్ చేసుకోవడం, క్లీన్ చేసుకోవడం చాలా సులభం. ఇది చూడటానికి సూట్‌కేస్‌లా ఉంటుంది. మేకర్ ముందు భాగంలో రెండు రెగ్యులేటర్స్ ఉంటాయి. ఇది గ్యాస్ సాయంతో పనిచేస్తుంది. చిన్న గ్యాస్ సిలెండర్‌ని కూడా సెట్ చేసుకోవచ్చు. గ్రిల్ ప్లేట్స్ మార్చుకోవచ్చు. ఈ మేకర్ లోపల రెండు స్టెయిన్ లెస్ స్టీల్‌తో రూపొందిన గ్యాస్ స్టవ్‌లు అమర్చి ఉంటాయి. దీని మూత ఒకవైపు మేకర్‌కి అటాచ్ అయ్యుంటుంది. దాంతో సూట్‌కేస్‌ను తెరిచినట్లుగా ఓపెన్ చేసుకోవచ్చు. తేలికగా అటూ ఇటూ కదపడానికి ఒకవైపు రెండు చక్రాలు ఉంటాయి. మరోవైపు డివైజ్ మొత్తాన్ని పట్టుకునే హ్యాండిల్ ఉంటుంది. అదే మెషిన్ నిలబడటానికి స్టాండ్‌గా కూడా ఉపయోగపడుతుంది. ఇరువైపులా కూరగాయలు కట్ చేసుకోవడానికి, ఉప్పు, కారం డబ్బాలు పెట్టుకోవడానికి స్పెషల్ ప్లేట్స్ అమర్చి ఉంటాయి.

# నోరూరించే కొండ మామిడి.. దీని ప్రత్యేకత ఏమిటంటే?



రాజవొమ్మంగి(అల్లూరి సీతారామరాజు జిల్లా): తూర్పు కనుమ అడవుల్లో ఈ కాలంలో ప్రకృతి సిద్ధంగా విరివిగా కనిపించే కొండమామిడి కాయలు అంటే ఇష్టపడని వారుండరు. ఇవి పక్వానికి వచ్చి పండుగా మారేందుకు మరో 20 రోజులు పడుతుంది. రైతులు సాగు చేసే సాధారణ రకాలకు సంబంధించి దిగుబడి గణనీయంగా పడిపోయింది. కలెక్టర్, బంగినపల్లి, రసాల రకాలకు చెంది కాపు ఏటా కన్నా ఈ ఏడాది బాగా తగ్గింది. అక్కడక్కడ కలెక్టర్ రకం కాయలు మాత్రమే కనిపిస్తున్నాయి. అయితే అటవీప్రాంతంలో మాత్రం అడవి మామిడి చెట్లు మాత్రం విరగ్గాశాయి. పక్వానికి రాగానే వాటికవే చెట్ల పైనుంచి నేలరాలతాయి. మంచి సువాసనతో నోరూరించే ఈ పండ్లను తినేందుకు పిల్లలు పెద్దలు ఎంతో ఆసక్తి చూపుతారు. పండ్లు కాయలు ఆకుపచ్చ రంగులోనే ఉండటం వీటి ప్రత్యేకత. ప్రకృతి సిద్ధంగా లభించే ఈ మామిడి పండ్లకు స్థానికంగా మంచి గిరాకీ. ఏమాత్రం పచ్చిగా ఉన్నా నోట్లో పెట్టలేనంత పుల్లగా వుంటాయి. పీచు ఎక్కువ. గుజ్జు పసుపు రంగులో ఉంటుంది. వేసవిలో పిల్లలు ఈ చెట్ల కిందనే ఎక్కువ సమయం గడుపుతారు. మండలంలోని కిమ్మిలిగెడ్డ, అమ్మిరేఖల, కొత్తవీధి, లోదొడ్డి తదితర లోతట్టు ప్రాంతాల్లో కొండమామిడి చెట్లకు కొదవలేదు. కిమ్మిలిగెడ్డ సమీపాన రక్షిత అడవుల్లో ఇవి గుబురు గుబురుగా, ఎత్తుగా పెరిగి కనిపిస్తాయి. కొండమామిడి కాయలు ఆవకాయకు బాగుంటాయని చెబుతుంటారు. ఈ కాయలకు టెంక పెద్దది, గుజ్జు పీచు కట్టి ఉన్నందున ముక్కలు బాగా వస్తాయని, పులుపు ఎక్కువ కనుక ఆవకాయ పచ్చడికి శ్రేష్టమని గృహిణులు చెబుతారు. సాధారణ మామిడి రకాలు అందుబాటులో లేని కారణంగా ఈ ఏడాది ఇక కొండమామిడి కాయలపైనే ఆధారపడాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు.

# కీళ్ల నొప్పులా.. ఈ పండ్లు తిన్నారంటే



నేటి కాలంలో 30 ఏళ్లు దాటితే చాలు కీళ్ల నొప్పులు ప్రారంభమవుతున్నాయి. ఈ పరిస్థితిలో వాటిని ఎదుర్కోవటానికి చాలామంది చాలా చిట్కాలు పాటిస్తున్నారు. కానీ ఎటువంటి ఫలితాలు ఉండటం లేదు. కానీ ఆహారంలో ఈ మూడు పండ్లను చేర్చుకుంటే మంచి ఉపశమనం ఉంటుంది. ఆ పండ్లేమిటంటే...కీళ్లనొప్పులను తగ్గించే పండ్లునారింజ: రోజూ నారింజను తినడం వల్ల శరీరంలో నీటి కొరత తీరుతుంది. ఇందులో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. ఇది కీళ్లనొప్పులని తగ్గించడంలో సహాయపడుతుంది. ద్రాక్ష: వీలయినంత వరకు ద్రాక్షపండ్లను తీసుకోవడం ద్వారా అనేక రకాల వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుంది. ముఖ్యంగా కీళ్ల నొప్పుల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు. చిన్నప్పటినుంచి పిల్లలకి ద్రాక్ష పండ్లను తినిపించడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. పుచ్చకాయ: వేసవి కాలంలో పుచ్చకాయ తినడం అన్ని విధాల శ్రేయస్కరం. దీనివల్ల శరీరంలో నీటి కొరత ఉండదు. తక్షణ శక్తి లభిస్తుంది. దీనిని తప్పకుండా ఆహారంలో చేర్చుకోవాలి.

ఎండాకాలం బయటికి వెళ్లే ముందు లేదా బయటి నుంచి వచ్చిన తర్వాత పుచ్చకాయ తీసు కుంటే మంచి ఉపశమనం ఉంటుంది.

ఇందులో ఉండే పోషకాలు కీళ్ల నొప్పులని తగ్గిస్తాయి.

# రితుబెరి ఇక్కత్, ఖాదీలతో చేసిన రంగుల హంగామా చూడాల్సిందే!





వేసవిలో ఎక్కువగా వినిపించే పదం కాటన్. వేడిని తట్టుకొని, మేనికి హాయినిచ్చే సుగుణం ఉన్న ఫ్యాబ్రిక్. సింపుల్‌గా ఉండే కాటన్‌ని పార్టీవేర్‌గా మార్చుకోలేం. అనుకునేవారికి రితుబెరి కాటన్ కలెక్షన్ సరైన సమాధానం. లగ్జరీ ఫ్యాషన్ డిజైనర్‌గా పేరొందిన రితుబెరి ఇక్కత్, ఖాదీలతో చేసిన రంగుల హంగామా చూడాల్సిందే! సంప్రదాయ డిజైన్స్‌లోనే ఆధునికతను చూపడం ఈ డిజైనర్ ప్రత్యేకత. పలాజో, స్కర్ట్స్, ఓవర్‌కోట్స్, లాంగ్‌గౌన్స్‌కి రెండు మూడు రంగుల హంగులు అమర్చి చేసే మ్యాజిక్ చూపరులను మంత్రముగ్ధులను చేస్తాయి. చేనేతలతో ఎన్ని హంగుల అమరికతో వినూత్నమైన డిజైన్స్ తీసుకురావచ్చో రితుబెరి కలెక్షన్ చూస్తే ఇట్టే తెలిసిపోతుంది. క్రింకిల్డ్ ఖాదీ స్కర్ట్స్, ట్రౌజర్స్, ఎంబ్రాయిడీ చేసిన జాకెట్స్, లాంగ్ గౌన్స్.. కాంబినేషన్స్ చూపులను ఇట్టే కట్టిపడేస్తాయి. ఇకత్ రూపాలు ఇన్నన్ని కావు అని కళ్లకు కడతాయి. ఎక్కడ ఉన్నా ప్రత్యేకతను చాటుతాయి. విదేశాలలోనూ మన దేశీయ డిజైన్స్ ప్రత్యేకతను చాటే ఈ డిజైనర్ ఢిల్లీ వాసి. భారతదేశంలోని ఫ్యాషన్ పరిశ్రమలో సృజనాత్మకత, వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి లాభాపేక్షలేని 'ది లగ్జరీ లీగ్'ని ప్రారంభించింది.

# తోతాపురి మామిడికాయలు, అరకేజీ బెల్లం..

## సింపుల్‌గా ఇలా ఆవకాయ పెట్టేయండి!



– బెల్లం ఆవకాయను ఇష్టపడే వారు చాలా మందే ఉంటారు. మరి ఈ వంటకం ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకుందామా!

**బెల్లం ఆవకాయ తయారీకి కావలసినవి:** తోతాపురి మామిడికాయలు ఐదు. బెల్లం అరకేజీ నువ్వులనూనె పావుకేజీఆవాలు పావు కేజీ, కారం కప్పు, ఉప్పు కప్పు, మెంతులు రెండు టీస్పూన్లు, పసుపు రెండు టీస్పూన్లుఇంగువ అరటీస్పూను తొక్కతీసిన వెల్లుల్లి రెబ్బలు కప్పు. **బెల్లం ఆవకాయ తయారీ విధానం** ముందుగా మామిడి కాయలను శుభ్రంగా కడిగి పొడిగా తుడుచుకోవాలి. కాయల్లో జీడి తీసేసి ముక్కలు చేసుకోవాలి. టెంకపైన ఉన్న జీడిపొరను తీసేసి శుభ్రంగా తుడవాలి. ఆవాలు, మెంతులను గంటపాటు ఎండబెట్టి పొడిచేసుకోవాలిఇప్పుడు పెద్ద గిన్నెతీసుకుని ఆవపొడి, పసుపు, మెంతి పిండి, కారం, ఉప్పు వేసి కలపాలి. ఇప్పుడు బెల్లాన్ని సన్నగా తురిమి వేయాలి. దీనిలో ఇంగువ కూడా వేసి చక్కగా కలపాలి. ఇప్పుడు మామిడికాయ ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి చేతితో కలపాలి. తర్వాత కొద్దిగా ఆయిల్ తీసి పక్కనపెట్టి, మిగతా ఆయిల్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని పొడి జాడీలో వేసి పైన మిగతా ఆయిల్ వేయాలి. మూడు రోజుల తరువాత పచ్చడిని ఒకసారి కలపాలి, జాడీలో నిల్వచేసుకోవాలి.

# కూల్‌గా ఉంటే హాట్‌గా, హాట్‌గా ఉంటే కూల్‌గా!



మీరు కూల్‌గా ఉంటే.. హాట్‌గా హాట్‌గా ఉంటే కూల్‌గా క్షణాల్లో మార్చేస్తుంది. అంతేనా ప్రజలు ప్రతి ఏడాది మే 21న అంతర్జాతీయ టీ దినోత్సవాన్ని పాటించడం ఆనవాయితీగా వస్తోంది. అంతర్జాతీయ టీ దినోత్సవం అనేది సాంస్కృతిక వారసత్వం, ఆరోగ్య ప్రయోజనాలు, టీ ఆర్థిక ప్రాధాన్యతను సెలబ్రేట్ చేసుకోవడం, తేయాకుఉత్పత్తిని రక్షించి, దాని ప్రయోజనాలను ముందు తరాలకు అందించేలా 'ఫీల్డ్ నుండి కప్పు వరకు' అనే నినాదంతో ఈ డేను నిర్వహిస్తారు.








వాన కురిసినా.. ఫ్రెండ్స్‌తో గాసిప్ టైం అయినా..తలనొప్పి వచ్చినా... పరీక్షలకు ప్రిపేర్ కావాలన్నా.. అంతెందుకు పొద్దున లేవగానే మన బుర్రలో వచ్చే ఏకైక థాట్ టీ. ఫ్రెష్‌గా వేడి వేడి టీ పడందే రోజు మొదలుకాదు చాలా మందికి. టీ అంటే కేవలం ఒక రిఫ్రెష్ డ్రింకే మాత్రమేనా. కానే కాదు..అదొక సెంటిమెంట్..ఎమోషన్. ప్రతి సంవత్సరం మే 21న అంతర్జాతీయ టీ దినోత్సవాన్ని జరుపుకుంటారు. అసలు మే నెలలోనే ఈ డేను ఎందుకు జరుపుకుంటారు? దీని వెనకాల హిస్టరీ ఏంటి? మే 21న అంతర్జాతీయ టీ దినోత్సవంగా ప్రపంచవ్యాప్తంగా నిర్వహించాలని టీ బోర్డ్ ఆఫ్ ఇండియా సూచన మేరకు భారత ప్రభుత్వం యూఎన్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్‌కి ప్రతిపాదించింది. అలా తొలి ఇంటర్నేషనల్ టీ దినోత్సవాన్ని 2005లో ఢిల్లీలో నిర్వహించారు. ఎందుకంటే చాలా దేశాలలో ఈ నెలలోనే టీ ఉత్పత్తి సీజన్ ప్రారంభమవుతుంది. తేయాకు కార్మికుల సురక్షిత పని పరిస్థితులు, సరైన వ్యాపార నిర్వహణతోపాటు తేయాకు ఉత్పత్తిని మెరుగుపరిచే పరిస్థితులపై అవగాహన కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలోనే ప్రపంచవ్యాప్తంగా



ఇండియాతోపాటు ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా వినియోగించే వాటిల్లో టీ కూడా ఒకటి. 2007లో టీ బోర్డ్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, భారత దేశంలో ఉత్పత్తి చేయబడిన మొత్తం టీలో 80 శాతం ఇండయన్సే వినియోగిస్తున్నారు. ఇక్కడ 5వేల సంవత్సరాలకు పైగా టీ మూలాలు విస్తరించి ఉన్నాయట. టీ అంటే ఒక భావోద్వేగం. సంతోషమైనా, ఉత్సాహమైనా, అలసిపోయినా సందర్భం ఏదైనా బెస్ట్ ఫ్రెండ్ టీ. దానికి చిట పట చినుకుల్లో పకోడీ తోడైతే ఆహా ఆ రంగు రుచి వాసనలతో మరో ప్రపంచంలో విహరిస్తాం. లక్షల మందికి ఉపాధినందిస్తున్న ఈ తేనీటిని సందర్భాన్ని బట్టి ప్రాంతాన్ని బట్టి దీనిని అనేక విధాలుగా తయారు చేయవచ్చు. వీటిలో కొన్ని కాశ్మీరీ కహ్వా, అల్లం టీ, తులసి టీ, సులైమాని టీ, రోంగా టీ, మసాలా టీ, లెమన్‌గ్రాస్ టీ, గ్రీన్ టీ. బెల్లం, మిరియాల టీ, అబ్బో.. ఈ లిస్ట్ చాలా పెద్దది.

మన బాడీ డిటాక్స్ చేసుకోవడానికి కూడా రకరకాల టీలు ఉపయోగపడతాయి. యాంటీ ఆక్సిడెంట్లు , యాంటీ ఇన్‌ఫ్లమేటరీ పదార్థాల సంపూర్ణ మిశ్రం టీ. హల్దీ టీ రోగనిరోధక శక్తిని పెంచి, కాలేయాన్ని శుభ్రపరిస్తే.. తేనె నిమ్మకాయ అల్లం దట్టించిన టీ గొంతు నొప్పి , జలుబుకు చక్కటి చిట్కా. అలాగే హనీ లెమన్ జింజర్ టీ, ఆమ్లా అల్లం టీ ద్వారా విటమిన్ సీ దొరుకుతుంది. దీంతో బరువు తగ్గించుకోవచ్చు. డిటాక్స్ డైట్‌లో అల్లం అజ్వైన్ లెమన్ టీ, జింజర్ అజ్వైన్ లెమన్ టీ చేర్చుకుంటే బరువు తగ్గే ప్రక్రియ వేగవంత మవుతుందని నిపుణులు కూడా నమ్ముతున్నారు. మరోవైపు సాహసికుడు,టీ ప్రేమికుడు, ఆండ్రూ హ్యూస్ చరిత్రలో అత్యధిక టీ పార్టీని నిర్వహించిన ఘనత సాధించారు. బ్లాక్ , గ్రీన్ టీ, పిప్పరమెంటు,



చమోమిలే వంటి టీలను ఆయన అందించారట. నేపాల్‌లోని మౌంట్ ఎవరెస్ట్ క్యాంప్ 2, మే 5, 2021న 6,496 మీటర్ల ఎత్తులో, ఆండ్రూ 15 మంది అధిరోహకుల బృందంతో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించారు. మరి మీరు కూడా మంచి టీ పార్టీతో మీ స్నేహితులతో ఇంటర్నేషనల్ టీ డేని ఎంజాయ్ చేయండి.



## ప్రగ్యా జైశ్వాల్ ఏ క్రికెటర్‌తో డేట్‌కు

# వెళ్లాలనుకుంటుందో తెలుసా..?

కంచె సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రగ్యాజైశ్వాల్ . ఆ తర్వాత అఖండ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది. ఈ జబల్ పూర్ భామ తాను సింగిల్‌గా ఉన్నానని, తనకు ఇష్టమైన వ్యక్తితో మింగిల్ అయ్యేందుకు రెడీగా ఉన్నానని చెప్పి అందరికీ షాకిచ్చింది.ఓ ఇంటర్వ్యూలో మీరు ఒకవేళ డేట్‌కు వెళ్లాలనుకుంటే ఏ క్రికెటర్‌ను సెలెక్ట్ చేసుకుంటారని ప్రశ్నించాడు యాంకర్. శుభ్‌మన్ గిల్ పేరు చెప్పడంతోనే.. పెద్దగా నవ్విన ప్రగ్యాజైశ్వాల్.. ఎందుకు కాదు..? విధి తలిస్తే ఏదైనా జరుగొచ్చు. నేను విధిని నమ్ముతానంటూ చెప్పుకొచ్చింది. ఈ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతుంది. ప్రగ్యా జైశ్వాల్ ప్రస్తుతం బాలకృష్ణ టైటిల్ రోల్ పోషిస్తున్న డాకు మహారాజ్‌లో నటిస్తుండగా.. షూటింగ్ పూర్తయింది.ఇక అఖండ 2లో మరోసారి బాలకృష్ణకు జోడీగా కనిపించబోతుంది. రామోజీఫిలిం సిటీలో వేసిన సెట్‌లో సీక్వెల్ షూటింగ్ మొదలు కానుంది. ప్రగ్యా జైశ్వాల్ మరోవైపు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటిస్తోన్న టైసన్ నాయుడు చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.

## మరో సినిమాతో వస్తోన్న ధృవ సర్జా..

## కోర ఫస్ట్ లుక్‌తో సూపర్ హైప్



కన్నడలో సూపర్ ఫాలోయింగ్ ఉన్న యాక్టర్లలో ఒకడు ధృవ సర్జా ఇటీవలే మార్టిన్ సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ టాలెంటెడ్ యాక్టర్ తాజాగా మరో సినిమాతో అందరినీ పలుకరించేందుకు రెడీ అవుతున్నాడు. అయితే ఈ సారి మాత్రం హీరోగా కాకుండా నిర్మాతగా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వస్తున్నాడు. ధృవ సర్జా సమర్పిస్తున్న తాజా ప్రాజెక్ట్ కోర.యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ మూవీలో సునామీ కిట్టి, చరిష్మా, పి మూర్తి లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ మూవీ ఫస్ట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. హీరో ముఖంపై గాట్లతో సీరియస్‌గా కనిపిస్తూ.. సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాడు.

ఒరటాశ్రీ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మీ జ్యోతి క్రియేషన్స్ మరియు రత్నమ్మ మూవీస్ పతాకాలపై డాక్టర్ ఎబి నందిని, ఎఎన్ బాలాజీ, పి మూర్తి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.ఈ మూవీలో ఎంకే మాత, మునిరాజు, నీనాసం అశ్వత్‌లు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి బిఆర్ హేమంత్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం కన్నడ, తెలుగు, తమిళం, హిందీ, మలయాళ

## పోలీసులు స్పందిస్తే

## విచారణకు వెళ్తా : రాంగోపాల్ వర్మ



ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫొటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన వ్యవహారంలో టాలీవుడ్ డైరెక్టర్ రాంగోపాల్ వర్మపై ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే ఈ కేసు విచారణకు హాజరుకావాలని ఏపీ పోలీసులు రెండు సార్లు నోటీసులు పంపినప్పటికీ.. విచారణకు వెళ్లలేదు వర్మ. ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా దాఖలు చేశాడు. కాగా తానెనెక్కడికీ పారిపోలేదు. చట్టాన్ని గౌరవిస్తా. ఇంకో షాక్ ఏంటంటే పోలీసులు ఇంత వరకు నా ఆఫీసులోకి కాలే పెట్టలేదంటూ ట్వీట్‌లో పేర్కొన్నాడు వర్మ. తాజాగా మీడియాతో వర్మ మాట్లాడుతూ.. నేను పారిపోలేదు.. హైదరాబాద్‌లోని డెన్‌లో ఉన్నా. నాపై ఐదు కేసులు పెట్టడం వెనుక కుట్ర ఉంది. నా రిప్లైపై పోలీసులు స్పందిస్తే విచారణకు వెళ్తానన్నాడు. అరెస్ట్ చేస్తారనే ముందస్తు బెయిల్ పిటిషన్ వేశా. అభిప్రాయాలు తెలుసుకునేందుకు ట్వీట్లు పెట్టా. నా ట్వీట్ల వెనుక రాజకీయ దురుద్దేశం లేదని క్లారిటీ ఇచ్చాడు. మరి దీనిపై పోలీసులు ఎలా స్పందిస్తారనేది చూడాలి.ఈ కేసు ఏమైనా ఎమర్జెన్సీ కేసా? ఏడాది తర్వాత ట్వీట్ చూసిన అతనికి వారంలో అన్నీ అయిపోవాలనడంలో ఏమైనా అర్థం ఉంటదా అసలు.. హత్యకేసుల్లాంటి వాటికి సంవత్సరాలు తీసుకొని.. ఇప్పుడు ఎమర్జెన్సీ కేసుల కంటే ముందే వీటిని విచారించడమేంటని తనదైన శైలిలో కౌంటర్ వేయగా.. ఇప్పటికే ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. కాగా రాంగోపాల్ వర్మ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో విచారణ వచ్చే సోమవారానికి వాయిదా పడింది. ఏజీ వచ్చి వాదనలు వినిపిస్తారని, అందుకు సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరిన మీదట న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు.

## విడుదల తేదీ ప్రకటించిన మోహన్ లాల్ 'ఎల్2 ఎంపురాన్'




మలయాళీ సూపర్ స్టార్ మోహన్ లాల్ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం లుసిఫర్ పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం మలయాళంలో బ్లాక్ బస్టర్ అందుకుంది. ఈ సినిమాలో మంజు వారియర్ , వివేక్ ఒబెరాయ్ టోవినో థామస్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఇక ఇదే సినిమాను తెలుగులో మెగాస్టార్ చిరంజీవి ( గాడ్ ఫాదర్ పేరుతో తెలుగులో రీమేక్ చేశాడు. తెలగులో కూడా ఈ సినిమా మంచి విజయాన్ని నమోదు చేసుకుంది. కాగా ఈ చిత్రం నుంచి సీక్వెల్ వస్తున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. లుసిఫర్ 2 ఎంపురాన్ అనే టైటిల్‌తో ఈ సినిమా రానుండగా.. ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే తాజాగా ఈ మూవీ షూటింగ్ కంప్లీట్ అయ్యిందని సాలిడ్ అప్‌డేట్‌ను ప్రకటించారు మేకర్స్.ఈ మూవీ షూటింగ్ ఈరోజు ఉదయం 5:35 గంటలకు, మలంపూజ రిజర్వాయర్ ఒడ్డున కంప్లీట్ అయ్యిందని.. సినిమాని కూడా మార్చి 27 2025న విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఇక సీక్వెల్‌కు కూడా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వం చేయనుండగా మురళి గోపి స్టోరీ అందిస్తున్నాడు. కాగా ఇందులో సూపర్ స్టార్ మోహన్ లాల్ మరింత స్టైలిష్?గా కనిపించనున్నట్లు టాక్.ఇదిలా ఉంటే.. పృథ్వీరాజ్‌కు దర్శకుడిగా ఇది మూడో సినిమా. మూడు సినిమాల్లో మోహన్‌లాల్ ప్రధాన హీరోగా ఉండటం విశేషం. ఇక ఈ సీక్వెల్ సినిమాను డబ్బును మంచి నీళ్ళలా ఖర్చు పెట్టే లైకా సంస్థ టేకోవర్ చేసుకుంది. తెలుగుతో పాటు, తమిళం, మలయాళం భాషల్లో ఈ సినిమా విడుదల కానున్నట్లు సమాచారం.

### నా ఫేవరేట్

## హీరో ప్రభాస్..

### రాజాసాబ్ షూట్‌పై మాళవిక మోహనన్ ఆసక్తికర కామెంట్స్



గ్లోబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి మారుతి డైరెక్షన్‌లో నటిస్తోన్న రాజాసాబ్ . హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోన్న ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన మోషన్ పోస్టర్ ఇప్పటికే రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్‌తో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ చిత్రంలో మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్ , ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. కాగా తెలుగులో తొలి సినిమానే ప్రభాస్‌తో చేయడం పట్ల చాలా ఎక్జయిటింగ్‌కు లోనవుతోంది మాళవిక. తాజాగా మీడియాతో చేసిన చిట్‌చాట్‌లో రాజాసాబ్ గురించి ఆసక్తికర వార్త షేర్ చేసి అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. రాజాసాబ్ షూటింగ్ దాదాపు పూర్తయింది. ఇది నా తెలుగు డెబ్యూ సినిమా. అంతేకాదు ఇది నా ఫేవరేట్ హీరో ప్రభాస్ సినిమా. రాజాసాబ్ అవుట్‌పుట్ చాలా బాగా వచ్చిందని చెప్పింది.తాజా టాక్ ప్రకారం రాజాసాబ్‌లో ఓ పాట పెండింగ్‌లో ఉండగా.. 2024 ముగిసే లోపు ఇటలీలో షూట్ పూర్తి చేయనున్నారట. మొత్తానికి రాజాసాబ్ ఈ ఏడాది ఫినిషింగ్ టచ్ ఇవ్వబోతున్నాడన్నమాట.మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన గ్లింప్స్‌లో ప్రభాస్ సూపర్ స్టైలిష్‌గా చేతిలో పూలబొకే పట్టుకొని అద్దంలో తనను తాను చూసుకుంటూ.. పూలు చల్లుతూ సరికొత్తగా కనిపిస్తూ సందడి చేస్తున్నాడు. రాజాసాబ్‌లో బాలీవుడ్ యాక్టర్ సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.

## ఓటీటీలో హెబ్బా పటేల్ ఫీవర్..

## ట్రెండింగ్‌లో సందేహం



కుమారి 21ఎఫ్ మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది హెబ్బా పటేల్ ఈ ముంబై భామ ఆ తర్వాత నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయినా.. ఓటీటీలో మాత్రం ఈ భామ నటిస్తోన్న సినిమాలకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇప్పటికే హనీమూన్ ఎక్స్‌ప్రెస్, వ్యవస్థ ట్రెండింగ్‌లో నిలుస్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచాయి. కుమారి 21ఎఫ్ మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది హెబ్బా పటేల్ ఈ ముంబై భామ ఆ తర్వాత నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయినా.. ఓటీటీలో మాత్రం ఈ భామ నటిస్తోన్న సినిమాలకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇప్పటికే హనీమూన్ ఎక్స్‌ప్రెస్, వ్యవస్థ ట్రెండింగ్‌లో నిలుస్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచాయి.(తాజాగా ఇదే లైన్‌లో వెళ్తోంది సందేహం . ఊరికి ఉత్తరాన ఫేం సతీశ్ పరంవేద డైరెక్ట్ చేసిన ఈ మూవీ థియేటర్లలో మంచి స్పందన రాబట్టుకోగా.. థ్రిల్లింగ్ లవ్ స్టోరీతో తెరకెక్కిన ఈ మూవీ మూవీ రీసెంట్‌గా ఈటీవీ విన్‌లోకి ఎంట్రీ ఇచ్చింది.ఈ వారం విడుదలైన సినిమాల్లో సందేహం ముందు వరుసలో నిలిచి ట్రెండింగ్ అవుతోంది. విష్ణు వర్షిని క్రియేషన్స్ బ్యానర్‌పై సత్యనారాయణ తెరకెక్కించిన ఈ మూవీలో శ్వేతావర్మ, రాశిక శెట్టి, శుభ శ్రీ రాయగురు, శ్రీనివాస్ బోగిరెడ్డి, సుందర్ రావు పర్చా, చంద్రశేఖర్ రావు ఇతర కీ రోల్స్ పోషించారు. ప్రేమ, నమ్మకం, షాకింగ్ ట్విస్టుల నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని ఫ్యామిలీతో కలిసి ఎంజాయ్ చేసేయండి.

# ఆఖరి మజిలికి ముక్తి ఆశ్రమ్. పేదోడికి అండగా పుట్ట లింగమ్మ ట్రస్ట్

**బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శ.**



మంథని ( ప్రశ్న న్యూస్) అద్దె ఇంట్లో ఉంటూ ఆఖరి మజిలీకి అష్టకష్టాలు పడే పేదోడికి ముక్తి ఆశ్రమం భరోసా ఇస్తోంది. అద్దె ఇంట్లో ఉంటున్న కుటుంబంలో ఎవరైనా చనిపోతే అంతిమ కార్యక్రమం ఆ అద్దె ఇంట్లో నిర్వహించేందుకు ఇంటి యజమానులు అడ్డుకుంటుంటం సమాజంలో జరుగుతూనే ఉన్నాయి. ఒకరు చనిపోతే గౌరవించాల్సిన పరిస్థితులు ఉన్నా కట్టుబాట్లు, ఆచారాల పేరుతో పేదోడిని ఇబ్బందులకు గురి చేసిన సందర్భాలుఉన్నాయి. నియోజకవర్గంలో ఎంతో మంది పేదలు తమ కుటుంబసభ్యుడు చనిపోతే అద్దె ఇంట్లో ఉంటలేక చివరకు పార్థివ దేహాన్ని రోడ్డుపైనే ఉంచిన సందర్భాలు అనేక ఉన్నాయి. పేదోడి ఆఖరి మజిలీకి కుటుంబసభ్యులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పుట్ట లింగమ్మ చారిటబుల్ ఆధ్వర్యంలో మంథని పట్టణంలోని బస్ డిపో సమీపంలో ముక్తి ఆశ్రమం నిర్మించారు. అద్దె ఇంట్లో ఉంటూ ఎవరైన చనిపోతే వారి అంతిమ సంస్కారాలతో పాటు కర్మకాండ పూర్తి చేసుకునే వరకు ఈ ముక్తి ఆశ్రమంలో ఉండి చేసుకునే విధంగా సదుపాయాలు కల్పించారు. ఈ మేరకు మంథని పట్టణానికి చెందిన పుల్లూరి ఆంజనేయులు మంథని పట్టణంలోని ఓ ఇంట్లో కిరాయి ఉంటున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఆంజనేయులు తల్లి లక్ష్మి మరణించగా అద్దె ఇంట్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇంటి యజమాని అంగీకరించలేదు. దీంతో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ముక్తి ఆశ్రమంలో వారి అంతిమ కార్యక్రమం చేసుకుంటున్నారు. ఆదివారం ఆ కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించారు. ముక్తి ఆశ్రమం మీలాంటి పేదోళ్ల కోసమే ఏర్పాటు చేశామని, పేదోడి ఆఖరి మజిలీలో ఎలాంటి ఇబ్బందులు రాకూడనే ఆలోచనతో ముక్తీ ఆశ్రమ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు.

# సున్నిపెంట గ్రామంలో అనుమానాస్పద స్థితిలో దళిత యువతి మృతి

**- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం**

**- హత్యే, ప్రేమ పేరుతో వేధించిన యువకుడు శివ సాయి అనే వ్యక్తి పనే యువతి తల్లి పిన్ని ఆరోపణ.?**

**ఎవరు ఇంట్లో లేని టైంలో దళిత యువతిని ప్రియుడు గొంతు నులిమి చంపి అనంతరం ఫ్యానుకు ఉరేసి చంపినట్లు తల్లి పిన్ని ఆరోపణలు ఆలస్యంగా వెలుగులోకి ఈ ఘటన నంద్యాల జిల్లా సున్నిపెంట గ్రామంలో జరిగింది.?**



**శ్రీశైలం (ప్రశ్న న్యూస్)** నంద్యాల జిల్లా శ్రీశైలం మండలం సున్నిపెంట గ్రామం లోని ఖాదర్ హోటల్ సమీపంలో గత మంగళవారం డిగ్రీ విద్యార్థిని చింతాల లక్ష్మి (17)సంవత్సరాలు నవంబర్ 26 మంగళవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. తల్లి చింతాల వనజ పిన్ని కృష్ణవేణి మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా సున్నిపెంట గ్రామానికి చెందిన చింతాల లక్ష్మి (17) డిగ్రీ చదివే విద్యార్థిని తండ్రి కాంతారావు లేట్ తల్లి వనజ మంగళవారం రోజువారిగా కాలేజీకి వెళ్లి వచ్చి చదువుకుంటా అని తల్లికి చెప్పి లక్ష్మి వాళ్ళ తాత ఇంట్లో చదువుకునేందుకు 4:00 గంటల సమయంలో వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాలేదని దీంతో అదే రోజు సాయంత్రం 6 గంటలకు మృతురాలు లక్ష్మి తల్లి వనజ తాత వాళ్ళింట్లో చూడగా ఫ్యానుకు చున్నితో వేలాడుతూ కనిపించిందని తల్లి వనజ తెలిపారు అనంతరం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకుపోయారని అప్పటికే గంట క్రితమే యువతి మృతి చెందినట్లు డాక్టర్లు తెలపడంతో వారు పోలీసులకు ఫిర్యాదు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసినట్టు వారు తెలిపారు అయితే గత మూడు నెలల కిందట యువతీ లక్ష్మి యువకుడు శివ సాయి శంకర్ ఇద్దరు వాళ్ల ఇంటి నుండి పారిపోయారని అయితే సుండుపెంట టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు తమ అమ్మాయిని ఓ యువకుడు ప్రేమ పేరుతో వేధించాడని, అతడే యువతి లక్ష్మి ని హత్యచేశాడని యువతి తల్లి పిన్ని మీడియాతో అన్నారు యువతి లక్ష్మిని కొట్టి చంపి ఫ్యానుకు ఉరేసి హత్య చేసి ఇంటి వెనక నుండి శ్రీశైలానికి చెందిన యువకుడు శివ సాయి శంకర్ పారిపోయినట్లు లక్ష్మి బంధువులు ఆరోపించారు గతంలో కొంతమంది యువతులను ఇలాగే మోసం చేశాడని శివ సాయి శంకర్ కు చెడు వ్యసనాలు చిల్లర వేషాలు ఉన్నాయని శివ సాయి శంకర్ కి శిక్షపడేలా చేయాలని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ మీడియా ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని మరియు నారా లోకేష్ ని వాళ్ళ బంధువులు కోరారు.

# శ్రీశైలం మల్లన్న సేవలో తెలంగాణ మంత్రి సీతక్క అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ




శ్రీశైలం (ప్రశ్న న్యూస్) కార్తీక మాసం చివరి ఆదివారం అమావాస్య సందర్భంగా శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోవడానికి తెలంగాణ మంత్రి సీతక్క,అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీశైలం ఆలయానికి విచ్చేసిన సందర్భంగా ఆలయ రాజగోపురం వద్ద ఏ ఈ ఓ శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు ఉండవల్లి శ్రీనివాస్ రెడ్డి, ఆలయ అధికారులు, వేద పండితులు, అర్చకులు మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలకడం జరిగింది. అనంతరం ప్రధాన ద్వారం గుండా శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించుకోవడం జరిగింది.అమ్మవారి దర్శనం అనంతరం వేద పండితులచే వేద ఆశీర్వచనం నిర్వహించి మంత్రి సీతక్కకు, ఎమ్మెల్యే వంశీకృష్ణకు శేష వస్త్రాలు, లడ్డు ప్రసాదాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారి వెంట శ్రీశైలం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.ప్రసాద్ రావు,స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉండడం జరిగింది.

# గురుకులపై తప్పుడు ప్రచారం చేస్తుందే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రే

**కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) గురుకులపై తప్పుడు ప్రచారం చేస్తుంది ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అని మీడియా సమక్షంలో తెలిపిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి రాజి రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన పైన పింక్ మీడియా తో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోంది.గురుకులాల పైన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పెద్ద కుట్ర కు పాల్పడుతున్నాడు.. గురుకులాల సెక్రటరీ గా ఉన్నప్పుడు నియమించుకున్న తన మనుషులతో ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తున్నాడు..పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల విషయంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నీచానికి పాల్పడుతున్నాడు.మా ముఖ్యమంత్రి 40 శాతం డైట్ చార్జీలు పెంచి మంచి భోజనం అందిస్తుంటే ఓర్వ లేక ఫుడ్ పాయిజన్ అంటు కుట్రలు చేస్తున్నారు..సోషల్ మీడియాలో ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలకు నిజాలు తెలుసు.. 10 యేళ్ళ పాటు అధికారంలో ఉండి కనీసం డైట్ ఛార్జ్ లు పెంచలేదు..తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పినా బీఆర్ఎస్ నేతలు మారడటం లేదు..10 సంవత్సరాలుగా అన్ని వర్గాలను మోసం చేసిన బీఆర్ఎస్ నేడు కాంగ్రెస్ పార్టీని బద్నం చేస్తుందని ఆరోపించారు. హాస్టల్లో నెలకొన్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని హాస్టళ్లను దత్తత తీసుకుంటామని అన్నారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి హరీష్ రావు గారు ప్రజలను రెచ్చ గొడుతున్నారన్నారు..తెలంగాణ రాష్ట్ర ప్రజలు వారి మాటలను,వారి అసత్య ప్రచారాలను ఏ విధంగాను నమ్మే స్థితులో లేరని వారికి సత్య- అసత్యాల గురించి వారికి తెలుసు అన్నారు.కలెక్టర్ దాడి పైన,సంక్షేమ హాస్టల్లో ఫుడ్ పాయిజన్ పైన రాజకీయ కుట్రలు చేస్తున్నారు. రైతు పక్షపాతిగా రైతుల సంక్షేమం కోసం పెద్దపీట వేస్తూ ఏడాది కాలంలోనే దేశంలో ఏ రాష్ట్రం ఖర్చు చేయని విధంగా 54,280 కోట్ల రూపాయలను రైతుల కోసం ఖర్చు చేసిన ఏకైక ప్రభుత్వం మన ప్రజా ప్రభుత్వం.. రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతన్న ఇంట్లో వెలుగులు నింపిన కాంగ్రెస్ ప్రభుత్వం.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మాజీ ఎంపిపి శ్రీనివాస్ గౌడ్, నర్సాపూర్ బ్లాక్ అధ్యక్షులు రిజ్వాన్,నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ మండల అధ్యక్షులు మల్లేష్,నర్సాపూర్ మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు అజ్మాత్, రషిద్, మల్లేష్ యాదవ్, సాగర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఎంపీ నీ కలిసిన గుండ్ల పోచంపల్లి బిజెపి నాయకులు

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )మేడ్చల్ మండలంలోని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని నాలుగవ వార్డు కౌన్సిలర్ అమరం సరస్వతి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏజీ కాలనీలోనీ పార్క్ అభివృద్ధి కొరకు ఎంపీ నిధుల నుండి పార్కు సుందరీ కరణ చేయవలసిందిగా కోరుతూ పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కి వినతిపత్రం సమర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రం రెడ్డి, మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు ఉషి శ్రీనివాస్ ముదిరాజ్, 13 వ వార్డ్ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, ఏజీ కాలనీ అధ్యక్షుడు మహేష్, సుభాష్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, అంబటి, శ్రీనివాస్, అమర్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరంగవరం గ్రామంలో ఉద్రిక్తత

**- దేవాలయ స్థలం కబ్జా చేసిన విషయంలో ఘర్షణ**

**- ఇద్దరు యువకులపై దాడి**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో దేవాలయ భూమి కబ్జా



స్థలం విషయంలో గ్రామంలోని రెండు వర్గాల మధ్య ఆదివారం జరిగిన ఘర్షణ గ్రామంలో ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామంలోని సర్వే నంబర్ 218లో ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం సంబంధించిన 500 గజాల స్థలం కబ్జాకు గురైందంటూ ఒక వర్గం సదరు స్థలానికి చేరుకుంది. అదే సమయంలో మరో వర్గం వచ్చి వాగ్వాదంకు దిగడంతో ఇరు వర్గాల మధ్య మాట మాట పెరిగి గొడవకు దారి తీయడంతో పాటు కబ్జా గురైన స్థలాన్ని క్లీన్ చేయడానికి జేసీబీ రావడంతో ఒకేసారి పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. స్థలాన్ని క్లీన్ చేయకుండా జీడిపల్లి జ్ఞానేశ్వర్, జీడిపల్లి శ్రావణ్, శీలం సాయి అనే ముగ్గురు వ్యక్తులు గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డి, దుబ్బ ఆనంద్ లు పైన తెలిపిన ముగ్గురు వ్యక్తులపై దాడికి దిగారు. దీంతో రెండు వర్గాల మధ్య తీవ్ర తోపులాట జరిగింది.

# వేడుకగా అంబర్ పేట పద్మశాలి సంఘం కార్తీక మాస వనభోజనాలు

**విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు**



అంబర్ పేట(ప్రశ్న న్యూస్) అంబర్ పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉస్మానియా యూనివర్శిటీ ఫ్యాకల్టీ క్లబ్లో నిర్వహించిన కార్తీక మాస వనభోజనాలు, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమం ఆద్యంతం వేడుకగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ చైర్మన్ బి.ఎస్.రాములు, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలీలు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. రాజకీయంగా ఎదగాలని చెప్పారు. అంబర్ పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కార్తీకమాస వనభోజనాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఆత్మీయ అతిథులుగా అఖిల భారత పద్మశాలి సంఘం ఇంజనీర్స్ విభాగ్ సంఘ్ అధ్యక్షుడు డా. పుట్ట పాండురంగయ్య, గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్రావు, తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డా.మార్త రమేష్, ప్రొ.తాటికొండ వెంకట రాజయ్య, నియోజకవర్గం గౌరవాధ్యక్షుడు ఎనుగంటి నరేందర్, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, మహిళా నాయకురాలు డా. వగ్గు సమత, పోరండ్ల శారద, స్వప్న, నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ఏవీ రాజశేఖర్ తదితరులు హాజరయ్యారు. అనంతరం పది, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి చిలక శివకుమార్, కోశాధికారి భీమనపల్లి అశోక్, ఉపాధ్యక్షుడు ఎలగంధుల అంజయ్య, గంగిశెట్టి సత్తయ్య, కుందెన సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శులు గంజి వెంకటరమణ, పెద్దబొమ్మ మధుసూధన్, తీగల నరేందర్, కార్యదర్శులు బోగ వెంకటయ్య, గందెమల్లి శ్రీనివాస్, గంగిశెట్టి మల్లేశ్, ప్రచార కార్యదర్శి వనం రమణ, కార్యవర్గ సభ్యులు రాజేందర్ నాగుల, ఆవుల రాములు, ఇడెం యాదగిరి, ఇడెం ధనంజయ, పులిపాటి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు పెద్దబొమ్మ దామోదర్, కాడిగె శ్రీనివాస్, గుర్రం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం దేవస్థానం లో సామూహిక ఆర్జిత అభిషేకాలు



శ్రీశైలం ( ప్రశ్న న్యూస్) గతంలో రూ. 1500/-ల రుసుముతో నిర్వహించబడుతున్న శ్రీస్వామివారి సామూహిక ఆర్జిత అభిషేకాలు అక్కమహాదేవి అలంకార మండపంలో ప్రతీరోజు మూడు విడతలుగా జరువబడేవి. అక్కమహాదేవి అలంకార మండపమునకు మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా ప్రస్తుతం ఈ సామూహిక అభిషేకాలను శ్రీస్వామిఅమ్మవార్ల నిత్యకల్యాణమండపంలో నిర్వహించడం జరుగుతున్నది.కాగా ఈ సామూహిక ఆర్జిత అభిషేకాలను నిత్య కల్యాణమండపంలో నిర్వహించడం వలన కొన్ని సందర్భాలలో ప్రతీరోజు ఉదయం జరిగే శ్రీవల్లీదేవసేనాసమేత సుబ్రహ్మణ్యస్వామివారి కల్యాణం మరియు సాయంకాలం జరిగే శ్రీస్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవంలో కాలతీతమయ్యే ఇబ్బంది కలుగుతున్నది.ఈ కారణంగా ప్రస్తుతం నిత్యకల్యాణమండపంలో నిర్వహించబడుతున్న ఈ సామూహిక ఆర్జిత అభిషేకాలు ఇకమీదట ఆలయప్రాంగణములోని మూడుశివాలయాల వద్ద ( సహస్రదీపాలంకరణ సేవా మండపం వెనుక) మరియు అక్కమహాదేవి - హేమారెడ్డి మల్లమ్మ మందిరాల (నవబ్రహ్మ ఆలయాల ప్రక్కన) వద్ద నిర్వహించబడుతాయి.గతంలో వలనే యథావిధిగా రోజుకు మూడు విడతలుగా ఉదయం గం.6.00లకు, మధ్యాహ్నం గం.12.00లకు మరియు రాత్రి గం.7.00లకు ఈ సామూహిక ఆర్జిత అభిషేకాలను నిర్వహించడం జరుగుతుంది. ఒక్కొక్క విడతలో 100 టికెట్లు మాత్రమే ఇవ్వబడుతాయి. భక్తులు గతంలో వలనే ఈ టికెట్లను ఆన్లైన్ ద్వారా పొందవలసి వుంటుంది. మరమ్మతులు పూర్తి అయిన వెంటనే ఈ సామూహిక ఆర్జిత అభిషేకాలను తిరిగి అక్కమహాదేవి అలంకార మండపంలోనే నిర్వహించబడుతాయి.తదుపరి ప్రతీమాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రము రోజున ఉదయం వేళల్లో శ్రీస్వామివారికి దేవస్థానం సేవను ( సర్కారీసేవ) నిర్వహించడం జరుగుతున్నది.అదేవిధంగా ప్రతీనెలలో మాసశివరాత్రి రోజున సాయంకాలం శ్రీస్వామివారికి దేవస్థానం సేవను (సర్కారీసేవను) నిర్వహించబడుతున్నది. ఈ కారణంగా స్వామివారి ఆరుద్ర నక్షత్రం రోజున ఉదయం వేళల్లో మరియు మాసశివరాత్రిరోజున సాయంకాలం వేళల్లో శ్రీస్వామివారి స్పర్శదర్శనం టికెట్లను నిలుపుదల చేయడమైనది. కావున భక్తులు ఈ మార్పులను గమనించవలసినదిగా తెలియజేయడమైనది.

# పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరి పై ఉన్నది: కక్కిరేణి చేతన



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) శ్రీ చైతన్య రామాంతాపూర్ స్కూల్ లో నిర్వహించిన సాంఘిక శాస్త్ర దినోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరూ ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చూపిన ప్రతిభను వీక్షించడం, దీనిలో భాగంగా విద్యార్థులందరూ పర్యావరణాన్ని పరిరక్షించాలని, స్వచ్ఛ-భారత్ కార్యక్రమాన్ని అందరూ పాటించాలని కార్పొరేటర్ అన్నారు. ఏడు రోజులు జరిగిన ఈ కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, మెడల్స్ ను అందజేసి అభినందించారు.మరియు పాఠశాల ఆయాలకు



బహుమతులను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎ.జి.యం.1 మొహమ్మద్ నూర్ అలీ, జోనల్ కో ఆర్డినేటర్ సుధ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, ప్రైమరీ ఇన్చార్జులు శైలజా, నవనీత, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కక్కిరేణి చేతన హరీష్ కు ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి శ్రీ చైతన్య పాఠశాల తరపున ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు.

# పాల కల్తీ పాపమెవరిది.?

## ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్న కల్తీ పాలు

- డబ్బు సంపాదనే లక్ష్యంగా పాల కల్తీ దందా
- లక్షల లీటర్ల కొద్ది కృత్రమ పాల విక్రయాలు
- కల్తీ పాల నాణ్యత పెంచే దిశగా విషపూరిత రసాయణాల వాడకం
- డిటర్జంట్ పోడి, యూరియా, బోరిక్ ఆసిడ్, వంటి రసాయణాలతో పాల తయారీ
- కల్తీ పాలతో చిన్నపిల్లల్లో ఆనారోగ్యం సమస్యలు
- కల్తీలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తి విఫలం
- కల్తీలపై ఎమర్జెంన్సీ ప్రకటించి కఠిన చర్యలు తీసుకోవాలి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, ప్రతి ఒక్కరు రోజు పాలు తీసుకుంటారు. అయితే మీరు తాగే పాలు స్వచ్ఛమైనవా లేక కల్తీవా అనేదే ప్రధాన సమస్య పాలు ఆరోగ్యానికి మంచి పోషకాహారం, చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి రోజు పాలు, టీ, కాఫీని తాగుతున్నారు. అలాగే చిన్నపిల్లల్లోఎముకల బలం కోసం పాలను మరగించి తాగిస్తారు. దీంతో మార్కెట్లో పాలకు డిమాండ్ బాగా పెరిగింది. అయితే ఈ డిమాండ్‌ను ఆసరా చేసుకుని కల్తీ రాయుళ్లు రెచ్చిపోతున్నారు. రకరకాల బ్రాండ్ల పేరుతో తక్కువ ధరకే కల్తీ చేసిన పాలను అమ్ముతుండగా ఈ కల్తీ పాలు తాగిన వెంటనే ప్రజలు అనారోగ్యానికి గురవుచున్నారు. పాలలో కల్తీ చేసే విషతుల్యమైన కెమికల్స్ ఆరోగ్యానికి తీవ్ర ముప్పు కలిగిస్తున్నాయి. హైదరాబాద్‌లో కల్తీరాయుళ్లు ఇలాంటి పాలను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ పాలలో విషపూరితమైన అనేక రసాయనాల కల్తీతో పాల నాణ్యతను పెంచుతున్నారు.

### పాల నాణ్యత పెంచే దిశగా రసాయణాల కల్తీ

పాలు చిక్కగా, ఎక్కువ రోజులు నిల్వ ఉండటానికి బోరిక్ యాసిడ్, క్లోరిన్, అమ్మోనియం సల్ఫేట్ వంటి కెమికల్స్ కలుపుతున్నారు. ఇవే కాకుండా బెంజాయిక్ యాసిడ్, కాస్టిక్ సోడా, హైడ్రోజన్ పెరాక్సైడ్, సాలిసిలిక్ యాసిడ్ వంటి డేంజర్ రసాయనాలు మిక్స్ చేస్తున్నారు. ఈ రసాయనాలు ఉన్న కల్తీ పాలను తాగడం వల్ల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుంది.

### కల్తీ పాలతో ఆనారోగ్య సమస్యలు

కల్తీ పాల వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం పొంచి ఉంది. పాలలో కల్తీ చేసే విషపూరిత రసాయణాల వల్ల మూత్రపిండాల సమస్యలు, క్యాన్సర్, జీర్ణాశయ సమస్యలు, అతిసారం వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అలాగే కల్తీ చేయబడిన ఈ పాలు తాగడం వల్ల పేగులు దెబ్బతినడమే కాక కొలెస్ట్రాల్ పెరిగే ప్రమాదముందని, అలాగే రక్తంలో షుగర్ లెవల్స్ పెరుగే ప్రమాధం పోంచి ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ కల్తీ పాలను తాగితే మదుమేహ వ్యాధిగ్రస్తుల పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని సమాచారం.

### కల్తీ పాలు పిల్లలకు చాలా ప్రమాధం

కల్తీ పాలు పిల్లల ఆరోగ్యానికి మంచిది ఏ మాత్ర మంచిది కాదంటున్నారు నిపుణులు. ఈ పాలు తాగిన పిల్లలో తీవ్ర అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుచున్నాయని, కల్తీ పాలు తాగిన పిల్లలో గ్యాస్ట్రో ఎంటిరైటిస్, కడుపు నొప్పి సమస్యలు, ఫీవర్, టైఫాయిడ్, వాంతుల వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు పోడ చూపుతున్నయి. పిల్లలకే కాదు పెద్దల ఆరోగ్యానికి కూడా తీవ్ర ముప్పు మారింది. అందుకే ప్రజలు కల్తీ పాలతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### పాలలో డిటర్జెంట్ పాడి కల్తీని గుర్తించడం ఎలా

ముఖ్యంగా పాలలో డిటర్జెంట్ పొడిని కూడా కలుపుతారు. దీంతో పాలపై నురుగు వచ్చి స్వచ్ఛమైన పాల వల్లే చిక్కగా కనిపిస్తాయి. డిటర్జంట్ పొడి కల్తీని గుర్తించేందుకు ఒక గ్లాసులో కొంచెం పాలు తీసుకోని అంతే మొత్తంలో నీరు కూడా తీసుకోవాలి. ఈ రెండింటి బాగా కలిపి పరిశీలిస్తే ఆందులో డిటర్జెంట్ అవశేషాలు ఉంటే బాగా నురగ వస్తుంది. దీంతో పాలు కల్తీ జరిగిందని గుర్తించాలి. ఒకవేళ స్వచ్ఛమైన పాలైతే చాలా తక్కువ నురగ వస్తుందంటున్నారు నిపుణులు సూచిస్తున్నారు.

### యూరియా కల్తీని గుర్తించడం ఎలా

పాలను కల్తీ చేయడం కోసం 100 లీటర్ల నీటిలో 5 కిలోల యూరియాను బాగా కలుపుతారు. దీంతో ఆ మిశ్రమం పాలలా తెల్లగా మారిపోతుంది. పాల వాసన వచ్చేందుకు గాను కొన్ని కెమికల్స్ ను కలుపుతారు.

పాలలో యూరియా అవశేషాలు గుర్తించడానికి మార్కెట్‌లో యూరియా స్ట్రిప్స్ అందుభాటులో ఉన్నాయి. వాటిపై కొంచెం పాలు వేయాగా దానిపై గీతలు కనిపించాయంటే పాలు యూరియాతో తయారు చేశారని గ్రహించాలి. ఈ పాలు ఆరోగ్యానికి చాలా ప్రమాధకరం.

### కల్తీ పాలపై నియంత్రణ కరువు

రాష్ట్రంలో కల్తీపాలు వరదలై పారుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుంది. విచ్చల విడిగా మార్కెట్లలో కల్తీపాల విక్రయాలు పెరగడంతో ప్రజలు ప్రాణాలకు రక్షణ కరువైంది. ప్రతిదానిలో కల్తీ మూలంగా 98 శాతం మంది మధుమేషం, బ్లడ్ ప్రెషర్, ముత్రపిండాలు, గుండే జబ్బుల వ్యాధులకు గురై అకాల మరణాలకు గురవుచున్నారు.

వెంటనే ప్రభుత్వం స్పందించి కల్తీలపై ఎమర్జెన్సీ ప్రకటించి కల్తీలకు పాల్పడుచున్న దళారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రేవంత్ రెడ్డి సర్కార్ సరికొత్త రికార్డు

## - ఏడాదిలోనే రూ.830 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రేవంత్ రెడ్డి సర్కార్ మరో సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే సుమారు రూ.830 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్స్ విడుదల చేసి రికార్డు నెలకొల్పింది. రాష్ట్రంలోని లక్షా 66 వేల మంది పేద, మధ్యతరగతి కుటుంబాలు సీఎంఆర్ఎఫ్తో లబ్ధి పొందినట్టు సీఎంవో ఆదివారం (డిసెంబర్ 01) రోజున ప్రకటించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 నుంచి 2023 వరకు ఐదేళ్లలో రూ.2400 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ విడుదల చేసినట్టుగా పేర్కొంది. అంటే సగటున ఏడాదికి రూ.480 కోట్లు గత ప్రభుత్వం ఖర్చు పెడితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే రూ.830 కోట్ల సాయం అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారని పేర్కొంది. ఈ ఏడాది విడుదల చేసిన రూ.830 కోట్లలో ఇప్పటికే రూ.590 కోట్లు సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించినట్టు సీఎంవో స్పష్టం చేసింది. ఆరోగ్య శ్రీ పరిధిలో లేని చికిత్సలు, ఆర్థిక స్థోమత లేని పేద కుటుంబాలకు ఖరీదైన వైద్యం అందించేందుకు ప్రజా ప్రతినిధుల సిఫారసు మేరకు సర్కార్ ఈ సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే జిల్లా స్థాయిలో అవసరమైన వైద్య చికిత్స సదుపాయం లేని పరిస్థితుల్లో నిమ్స్‌తో పాటు ఎంఎన్జే క్యాన్సర్ ఆసుపత్రి, నిలోఫర్, ఈఎన్టీ, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో సీఎంఆర్ఎఫ్ ద్వారా చికిత్స అందిస్తున్నారు. ఇందుకు అయ్యే అంచనా ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. సీఎం సహాయ నిధి నుంచి సంబంధిత ఆసుపత్రికి ఎల్వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) జారీ చేస్తుంది. ఈ ఏడాదిలోనే 13 వేల మందికి ఎల్వోసీలు జారీ చేసింది. సుమారు రూ.240 కోట్ల ఎల్వోసీలు మంజూరు చేశారు. ఇందులో అత్యధికంగా చిన్న పిల్లలకు అవసరమయ్యే ఆపరేషన్లు, చికిత్సలకు కేటాయించారు. దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోనే ఎల్వోసీ ఇచ్చే ఏర్పాట్లు చేసింది. ఒక్కరోజు కూడా ఆలస్యం చేయవద్దని, ఆదివారంతో పాటు సెలవు దినాల్లో కూడా ఎల్వోసీలు క్లియర్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించినట్టు సీఎంవో తెలిపారు. ఇక గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ నిధులకు కూడా అవినీతి చీడ పట్టుకున్నదని సీఎంవో పేర్కొంది. కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎంఆర్ఎఫ్ అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేసినట్లు స్పష్టం చేసింది. మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా దరఖాస్తుదారులే తమ సీఎంఆర్ఎఫ్ సాయం ఏ దశలో ఉందో, ఎప్పటికప్పుడు స్టేటస్‌ను తెలుసుకునేలా ఆన్‌లైన్ వ్యవస్థను రూపొందించినట్లు వివరించింది. మోసాలకు చెక్ పేట్టేందుకు ఏకంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులపై లబ్దిదారుల పేర్లతో పాటు వారి బ్యాంక్ ఖాతా నంబర్‌ను రేవంత్ సర్కారు ముద్రిస్తోందని స్పష్టం చేసింది. పుట్టుకతోనే ఈఎన్‌టీ(మూగ, చెవుడు) సమస్యలతో పుట్టే పిల్లలకు 6 ఏండ్ల లోపల శస్త్రచికిత్సలు చేయించాల్సి ఉంటుంది.ఈ ఆపరేషన్ల ఖరీదు లక్షల్లో ఉండడంతో పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ఆపరేషన్లు చేయించుకోలేకపోతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సీఎం , ఎల్‌వోసీలు ఇచ్చి అటువంటి పిల్లలను ఆదుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 87 మంది పిల్లలకు ఎల్‌వోసీ ఇచ్చి ఆపరేషన్లు ఇచ్చారు. ఇది తమ పిల్లలకు రేవంతన్న ఇచ్చిన పునర్జన్మ అని పిల్లల తల్లిదండ్రులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని సీఎంవో తెలిపింది.

# భారీ అక్రమ షెడ్ నిర్మాణం

## -చోద్యం చూస్తున్న ఏసిపి

- కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు
- అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న చైన్ మెన్ లు న్యాక్, ఇంజనీర్
- సమగ్ర సర్వేలో బీజీ అంటు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న సిబ్బంది
- కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమా
- జనావాసాల మధ్య ఇంత భారీ షెడ్ నిర్మాణం వెనక ఎవరి హస్తం
- నాచారం మల్లాపూర్ డివిజన్లో అక్రమాలకు చక్రం తిప్పుతున్నది ఎవరు.?
- కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసిపి కృష్ణమోహన్ పట్టించుకోరా.?



**నాచారం (ప్రశ్న న్యూస్)** నాచారం, మల్లాపూర్ డివిజన్లో అక్రమ నిర్మాణాలు పుట్టగొడగల్లా పుట్టుకొస్తున్నాయి. ఇక్కడ రాజకీయ నాయకుల అండదండలు అంత ఇంత కాదు. ఎవరైనా ఫిర్యాదులు చేసిన ప్రశ్నించిన సాక్షాత్ ప్రజాప్రతినిధులనే అక్రమ నిర్మాణాల ప్రారంభోత్సవాలకు ఆహ్వానించేంత. కాప్రా సర్కిల్ పరిధిలోని నాచారం డివిజన్ నందు జనాభాషాల మధ్య బారి షెడ్ నిర్మాణం కు న అధికారులు, ప్రజా ప్రతినిధులే అండగా నిలుస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడి కాలనీలో చేపడుతున్న నిర్మాణాలకు అన్ని తానై ఓ నాయకుడు చక్రం తిప్పుతున్నాడనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. నిర్మాణానికికో రేటు ఆయన కను సన్నల్లోనే నిర్మాణాలు కొనసాగుతున్నా అధికారులు మాత్రం మల్లాపూర్, నాచారం డివిజన్ ల వైపు కన్నెత్తి చూడటం లేదు. అధికారులు, సిబ్బంది సైతం ఇక్కడి నిర్మాణాలపై ప్రేక్షక పాత్ర వహించాల్సిందే ఎందుకంటే ముందుగానే అక్రమ నిర్మాణదారులతో అంతర్గత ఒప్పందాలు చేసుకొని ప్రభుత్వానికే గండి కొట్టేంత దుర్మార్గానికి పొడగడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక అక్రమ నిర్మాణాలకైతే తీసుకున్న అనుమతులకు ఇక్కడ చేపడుతున్న నిర్మాణాలకే ఏలాంటి పొంతన కనిపించదు. జీ ప్లస్ టూ అనుమతులతో వాళ్ల ఇష్టం వచ్చినన్ని అంతస్తుల నిర్మించుకుంటున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. నిర్మాణాలు ఇక్కడ షరమామూలే.

కార్తికేయ నగర్ లో నిర్మిస్తున్న భారీ షెడ్ నిర్మాణం పై స్థానికులు కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు ఎన్ని ఫిర్యాదులు చేసిన స్పందించకపోవడం వెనక ఆయన హస్తం ఉందా లేకుంటే జిహెచ్ఎంసిలో అధికారులు లంచాలకు తప్ప బాధ్యతలకు విలువను ఇవ్వరా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గత కొన్నేళ్లుగా నాచారం, మల్లాపూర్ డివిజన్లలో చేపడుతున్న నిర్మాణాలకు వెనుక సూత్రదారిగా ప్రధాన పాత్ర పోషిస్తూ హాల్ చల్ చేస్తున్నడానే ఆరోపనలున్న అధికారులు మాత్రం ఇక్కడి అక్రమ నిర్మాణాలపై ఏలాంటి చర్యలు తీసుకోవటం లేదని పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. దీనికి తోడు సమగ్రసర్వేలో బీజీగా ఉన్నమంటూ సిబ్బంది చేతులు దులుపుకుంటూ పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సర్వే పేరుతో మాత్రం అక్రమ నిర్మాణాలను పక్కకు పెట్టేశారు కానీ వాటి వద్ద వసూలు మాత్రం తీసుకోవడం చాలా మామూలుగానే మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేశామంటారు కానీ వాటి రికార్డును అధికారులు సిబ్బంది మెంటల్ చేస్తే లేరని ఆర్టిఐ కి కూడా సమాధానాలు ఇవ్వడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం నోటీసులు ఇచ్చామని చెప్పడం తప్ప బాధ్యతారాహిత్యంగా నోటీసులకు సంబంధించిన రికార్డు మైంటెన్ చేయడం లేదని అందుకోసమే ఎప్పుడు ఏ భావనానికి నోటీసులు ఇచ్చారో కూడా పూర్తిస్థాయి వివరాలు చెప్పడం లేదని వీటిని ఎప్పటికప్పుడు పరిశీలించవలసిన ఎసిపి డిప్యూటీ కమిషనర్ జోనల్ కమిషనర్లు ఈనాడు వీటిపై స్పందించిన దాఖలాలు లేవు. ఈ అధికారులకు కనీస అవగాహన కూడా లేదని అయినా ఎవరి వాటాలు వారికి వెళ్తుంటే ఎవరు స్పందిస్తారు అంటూ ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైన కాప్రా సర్కిల్ పరిధిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై, అక్రమ షెడ్లపై ఉన్నత అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మంచు మాటున మహా కాలుష్యం



**న్యూఢిల్లీ(ప్రశ్న న్యూస్)** ప్రపంచాన్ని పీడిస్తున్న ప్రధాన సమస్య వాయు కాలుష్యం. మన దేశంలోని అనేక పట్టణాలు ప్రాంతాలు వాయుకాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నాయి. ఆంధ్రా కాశ్మీర్‌గా కనువిందు చేసే చింతపల్లి, లంబసింగి ప్రాంతాలు దట్టమైన పొగమంచు పొరలచాటున కనిపించే అందమైన పర్వతాలు, లోయలు కాశ్మీర్‌ను తలపిస్తాయి. ఆహ్లాదకరంగా కనిపించే దట్టమైన పొగమంచు మాటున కనిపించని కాలుష్యం కాచుకొని వుంటోంది. అటు కాలుష్యం? ఇటు పొగమంచుతో దేశంలోని చాలా నగరాలు ఢిల్లీ బాటలో పయనిస్తున్నాయి. వాహనాలు, పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంతో నగరాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. దేశంలోని మహానగరాల గాలి కాలుష్యాన్ని కట్టడి చేయడానికి నిర్దిష్ట ప్రణాళికలు లేవు. పెరుగుతున్న చలి తీవ్రత, పొగమంచుకు వాయు కాలుష్యం తోడై? మరింత ప్రమాదకరంగా మారుతున్నది. రాబోయే రోజులలో చలి తీవ్రత మరింత పెరుగుతుందని, సాధారణం కంటే అధికంగా వుంటుందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. ఇప్పటికే దేశ రాజధాని ఢిల్లీ? కాలుష్య కోరల్లో విలవిలలాడుతోంది. వాతావరణ కాలుష్యం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ప్రతి యేటా 70 లక్షల మందికి పైగా మరణిస్తున్నారని, ఈ సంఖ్య భారత్‌లో 16 లక్షలకు పైగా వుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. వాయు కాలుష్యం నేరుగా వయస్సుపైనా ప్రభావం చూపుతోందని మరో అధ్యయనం చెబుతోంది. చలి తీవ్రత క్రమేపీ పెరిగి, ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవిస్తున్నాయి. ఇది కేవలం అసౌకర్యానికి సంబంధించిన విషయం కాదు. మానవ ఆరోగ్యానికి వినాశకరమైన పరిణామాలను కలిగించే అంశంగా చూడాలి. గాలిలో పెరిగిన కాలుష్యం? అనారోగ్యానికి కారణమౌతోంది. ప్రత్యేకించి వృద్ధులు, చిన్నపిల్లలు, ఇప్పటికే శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడేవారికి ఇది మరింత ప్రమాదకరం. జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులు ఇన్‌ఫ్లూయెంజా లక్షణాలు వుంటాయని, తగిన జాగ్రత్తలు అవసరమని వైద్యులు చెబుతున్నారు. చిన్నపిల్లలు, గర్భిణీలు, వృద్ధులు, శ్వాస సంబంధిత ఇబ్బందులున్నవారు ఈ సీజన్‌లో జాగ్రత్తగా వుండాలని వైద్య ఆరోగ్య శాఖ హెచ్చరిస్తోంది. గాలి కాలుష్యంవల్ల న్యుమోనియా కేసులు పెరుగుతున్నాయని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'చలి అనేది శారీరక సమస్య మాత్రమే కాదు, మానసిక, శారీరక భావోద్వేగ సమస్య కూడా' అంటారో మానసిక శాస్త్రవేత్త. మంచు దుప్పటి కప్పుకున్న ప్రకృతి రమణీయంగా, ఆహ్లాదకరంగానే వుంటుంది. దాని వెనుక పొంచివున్న కాలుష్యం, పొగమంచు, చలి తీవ్రత మనిషికే కాదు, జంతువులకు కూడా ముప్పుగా పరిణమిస్తోంది. దీన్ని ఈ రుతువులో వచ్చే చిన్న సమస్యగా కాకుండా? ప్రజల ఆరోగ్య సమస్యగా భావించి, ప్రభుత్వాలు అవసరమైన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా సామాన్య ప్రజలకు అవగాహన కల్పించాలి.

# తెలంగాణలో మూడురోజులు వానలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)**తెలంగాణలో రాగల మూడురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు వాతావరణశాఖ ఎల్లో అలర్ట్‌ని జారీ చేసింది. హిందు మహాసముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాను నేపథ్యంలో తమిళనాడుతో పాటు ఏపీలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోనూ వర్షాలుపడుతాయని పేర్కొంది. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వస్తాయని అంచనా వచేసింది. సోమవారం నుంచి మంగళవారం వరకు భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జిల్లాల్లో వానలుపడే అవకాశాలున్నాయని చెప్పింది. అలాగే ఈ నెల 4 వరకు తేలికపాటి జల్లులు పడే సూచనలున్నాయని పేర్కొంది.



Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588